ప్రతి నిత్యం తాజా వార్తలతో నిజాలు నిగ్గు తేలుస్తూ, సమీకరించే అంశాలను విశ్లేషిస్తూ ముస్తాబయి మీ ముంగిటకు వస్తున్న అక్షరం తెలుగు దినపత్రిక

సుఫల అక్షరం



తెలుగు దినపత్రిక సామాన్యుడి అస్త్రం

ప్రకటనలకు (అడ్వర్టైస్‌మెంట్) కొరకు సంప్రదించండి

EDITOR & PUBLISHER: 9391690609, OFFICE: 7893003409.
aksharamtsnews@gmail.com .... www.aksharamtelugudaily.com

www.aksharamtelugudaily.com

RNI NO: TELTEL/2018/75419

సుఫల అక్షరం

సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక

SUPHALA AKSHARAM

రాష్ట్రంలో వచ్చే ఏడాది నుంచి 12వ తరగతి వరకు విద్యా విధానం

- నర్సరీ నుంచి యూనివర్సిటీ వరకు విద్యా సంస్కరణలు
- ప్రాథమిక, సెకండరీ, సీనియర్ సెకండరీగా విద్యా విభజన
- మధ్యలోనే చదువు మానేస్తున్న విద్యార్థుల సంఖ్య తగ్గించడమే లక్ష్యం
- వసతి గృహాలు, పాఠశాలల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి



THURSDAY 12TH NOVEMBER 2026 EDITOR : SHAIK YACOOB PASHA PAGES : 12 VOLUME : 09 ISSUE : 235 COST : 3\- KHAMMAM, TELANGANA

గురువారం 12 నవంబర్ , 2026 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 09 సంచిక :235 వెల : రూ.3/- ఖమ్మం, తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJ-GIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

మూసీ రివర్ ఫ్రంట్‌తో హైదరాబాద్‌కు కొత్త రూపు

- త్వరలోనే మూసీ రివర్ ఫ్రంట్ పనులు ప్రారంభం
- నైట్ ఎకానమీతో యువతకు ఉపాధి అవకాశాలు
- విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వం
- జాతీయ విద్యా దినోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్, నవంబర్ 11

అక్షరం న్యూస్

మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు.





వైఎస్సార్ నగర్ పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలి

- గుడిసెల కూల్చివేత ఘటనపై సమగ్ర విచారణ జరపాలి
- బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జనసేన డిమాండ్
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతిపత్రం
-20 ఏళ్లుగా నివసిస్తున్న అర్హులకు పట్టాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి

హన్మకొండ, నవంబర్ 11 అక్షరం న్యూస్

గ్రేటర్ వరంగల్ పరిధిలోని కాజీపేట వైఎస్సార్ నగర్ కాలనీలో గత 20 ఏళ్లుగా నివసిస్తున్న పేద ప్రజల గుడిసెలను కూల్చివేసి, వారిపై దౌర్జన్యానికి పాల్పడిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని జనసేన పార్టీ డిమాండ్ చేసింది. ఈ ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరింది. హన్మకొండ పర్యటనకు వచ్చిన తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ పద్మజ దేవి, గాదె పృథ్వీ కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కాజీపేట వైఎస్సార్ నగర్ కాలనీలో పేద కుటుంబాలు సుమారు రెండు దశాబ్దాలుగా నివాసం ఉంటున్నాయని జనసేన నాయకులు వినతిపత్రంలో పేర్కొన్నారు. అక్కడ నివసిస్తున్న వారి గుడిసెలను కూల్చివేయడంతో కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు.

వివరాలు 2లో

వీర తిలకం దిద్ది ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ప్రారంభించిన కవిత

తెలంగాణ రక్షణ సేన తొలి ఎన్నికల బరిలోకి
అభ్యర్థులకు సర్వమత పెద్దల ఆశీర్వచనాలు
ప్రచార వాహనాలను జెండా ఊపి ప్రారంభించిన పార్టీ చీఫ్
రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థుల ప్రచారం షురూ

హైదరాబాద్, నవంబర్ 11 అక్షరం న్యూస్

తెలంగాణ రక్షణ సేన పార్టీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించింది. పార్టీ స్థాపించిన తర్వాత తొలిసారిగా ఎన్నికల బరిలోకి దిగుతున్న నేపథ్యంలో బుధవారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత అభ్యర్థులను ఆశీర్వదించి, వీర తిలకం దిద్ది ప్రచారానికి శ్రీకారం చుట్టారు. అనంతరం పార్టీకి చెందిన ప్రచార వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. ఎన్నికల్లో విజయం సాధించి ఎమ్మెల్సీలుగా తిరిగి రావాలని అభ్యర్థులను ఆశీర్వదించారు. ప్రచార ప్రారంభ కార్యక్రమానికి ముందు హిందూ, ముస్లిం, క్రైస్తవ, సిక్కు మతాలకు చెందిన పెద్దలు సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు ఆశీర్వచనాలు అందజేశారు. అన్ని మతాల పెద్దలు ఒకే వేదికపైకి వచ్చి అభ్యర్థుల విజయాన్ని ఆకాంక్షించడం కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రజాస్వామ్య ప్రక్రియలో అన్ని వర్గాల భాగస్వామ్యం, ఐక్యతను చాటేలా ఈ ప్రార్థనలు నిర్వహించారు.



ప్రాంతీయ ఆరోగ్య సహకారానికి భారత్ కట్టుబాటు

- కొలంబోలో తొలి బిమ్‌స్టెక్ ఆరోగ్య మంత్రుల సమావేశం
- సార్వత్రిక ఆరోగ్య సంరక్షణలో భారత్ పురోగతిని వివరించిన జేపీ నడ్డా
- మహమ్మారుల సన్నద్ధత, ఆరోగ్య భద్రతపై సమన్వయానికి పిలుపు
- సంప్రదాయ వైద్య విధానంలో పరిశోధనలకు ప్రత్యేక కేంద్రం

న్యూఢిల్లీ, నవంబర్ 11 అక్షరం న్యూస్

ప్రాంతీయ దేశాల మధ్య ఆరోగ్య రంగ సహకారాన్ని మరింత బలోపేతం చేయడానికి భారత్ కట్టుబడి ఉందని కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా స్పష్టం చేశారు. శ్రీలంక రాజధాని కొలంబోలో జరిగిన తొలి బిమ్‌స్టెక్ ఆరోగ్య మంత్రుల సమావేశంలో ఆయన ప్రారంభోపన్యాసం చేశారు. ఆరోగ్య భద్రత, ప్రజారోగ్య మౌలిక సదుపాయాలు, వైద్య సేవల్లో సాంకేతికత వినియోగం వంటి అంశాలపై భారత్ అనుభవాలను వివరించారు.

వివరాలు 2లో





డిసెంబర్ నెలాఖరులోగా రెడ్లకుంట ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలి: మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

- కోదాడ నియోజకవర్గంలో ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంత్రి - తనిఖీలో పాల్గొన్న నల్గొండ ఎంపీ కే. రఘువీర్‌రెడ్డి
- పనుల పురోగతిపై కలెక్టర్, నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్ష - గడువులోగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశం

02




చెన్నైలో రాపిడో హెచ్‌వీ అనుభవ కేంద్రం ప్రారంభం

- మూడు అంతస్తుల్లో అత్యాధునిక ప్రదర్శన కేంద్రం
- సచివాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం జోసెఫ్ విజయ్
- పెరుంగుడిలో ఓఎంఆర్ రోడ్డుపై ఏర్పాటు
- అధిక వోల్టేజీ విద్యుత్ మోటార్‌సైకిళ్ల తయారీలో సంస్థ ప్రత్యేకత

02

పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం

- తమిళనాడు, పుదుచ్చేరి, కారైకాల్‌లో వర్ష సూచన
- అండమాన్ నికోబార్ దీవుల్లోనూ భారీ వర్షాలు
- ఈశాన్య రాష్ట్రాల్లో పిడుగులతో కూడిన ఉరుములు
- కేరళ, లక్షద్వీప్‌లో రేపటి వరకు ఇదే పరిస్థితి



02

మొదటిపేజీ తరువాయి

పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం

న్యూఢిల్లీ, నవంబర్ 11 అక్షరం న్యూస్

దేశంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. తమిళనాడు, పుదుచ్చేరి, కారైకాల్‌తో పాటు అండమాన్ నికోబార్ దీవుల్లో బుధవారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. ఆయా ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.ఈశాన్య భారతంలోని అస్సాం, మేఘాలయ, నాగాలాండ్, మణిపూర్, మిజోరం, త్రిపుర రాష్ట్రాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. వర్షాల సమయంలో పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించింది. కేరళ, మాహే, లక్షద్వీప్ ప్రాంతాల్లోనూ వర్షపాతం నమోదయ్యే పరిస్థితులు ఉన్నాయని పేర్కొంది. ఈ ప్రాంతాల్లో గురువారం వరకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కొనసాగవచ్చని అంచనా వేసింది. స్థానిక వాతావరణ పరిస్థితులను బట్టి వర్షాల తీవ్రతలో మార్పులు ఉండవచ్చని తెలిపింది. భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచే అవకాశం ఉంటుంది. రహదారులపై ప్రయాణించే వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి. ఉరుములు, మెరుపులు సంభవించే సమయంలో బహిరంగ ప్రదేశాలు, చెట్ల కింద ఉండకుండా సురక్షిత ప్రాంతాలకు వెళ్లడం అవసరం. వాతావరణ శాఖ తాజా హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనించాలని ప్రజలకు సూచించింది. స్థానిక అధికారులు జారీ చేసే సూచనలు పాటించాలని, వర్షాల సమయంలో అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంది.

ప్రాంతీయ ఆరోగ్య సహకారానికి భారత్ కట్టుబాటు

మొదటిపేజీ తరువాయి

ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా దేశంలో సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ లక్ష్యాన్ని సాధించే దిశగా చేపట్టిన చర్యలను నడ్డా ప్రస్తావించారు. ప్రజారోగ్య మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, డిజిటల్ ఆరోగ్య సేవలను విస్తరించడం ద్వారా వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నట్లు తెలిపారు. ఈ రంగాల్లో సాధించిన అనుభవాలను బిమ్స్‌టెక్ సభ్య దేశాలతో పంచుకునేందుకు భారత్ సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.ప్రాంతీయ ఆరోగ్య భద్రత కోసం సభ్య దేశాల మధ్య సమన్వయం అవసరమని నడ్డా అభిప్రాయపడ్డారు. అంటువ్యాధులు, మహమ్మారులను ఎదుర్కొనే సన్నద్ధతను పెంచుకోవడం, వన్ హెల్త్ విధానాన్ని ప్రోత్సహించడం, సంప్రదాయ వైద్య విధానాలపై సహకారాన్ని విస్తరించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఆరోగ్య సమస్యలను సమష్టిగా ఎదుర్కొనేందుకు దేశాల మధ్య సమాచార మార్పిడి, పరస్పర సహకారం కీలకమని వివరించారు. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో సంప్రదాయ వైద్య విధానాలపై బిమ్స్‌టెక్ అత్యుత్తమ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు భారత్ కట్టుబడి ఉందని నడ్డా వెల్లడించారు. ఈ కేంద్రం ద్వారా ఉమ్మడి పరిశోధనలు, నైపుణ్యాభివృద్ధి, విజ్ఞాన మార్పిడికి అవకాశాలు కల్పించాలన్నది లక్ష్యమని తెలిపారు. సభ్య దేశాల మధ్య సంప్రదాయ వైద్య రంగంలో పరస్పర అవగాహన, సహకారాన్ని పెంపొందించేందుకు ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. ‘ఒకే భూమి.. ఒకే కుటుంబం.. ఒకే భవిష్యత్తు’ అనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికతకు అనుగుణంగా ఆరోగ్యకరమైన, సమ్మిళితమైన, విపత్తులను తట్టుకోగల ప్రాంతీయ వ్యవస్థ నిర్మాణానికి భారత్ కృషి చేస్తుందని నడ్డా పునరుద్ఘాటించారు. బిమ్స్‌టెక్ దేశాల మధ్య ఆరోగ్య రంగ భాగస్వామ్యం మరింత విస్తరించడం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు మార్గం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మొదటిపేజీ తరువాయి

వైఎస్సార్ నగర్ పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలి

గుడిసెల తొలగింపు సమయంలో ప్రజలపై దౌర్జన్యం, దాడి జరిగినట్లు ఆరోపించారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి, బాధితుల వాదనలను కూడా పరిగణనలోకి తీసుకుని నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని కోరారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వైఎస్సార్ నగర్ కాలనీవాసులకు ఇంటి పట్టాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని జనసేన నాయకులు ప్రస్తావించారు. ఆ హామీని అమలు చేయాలని ఉప ముఖ్యమంత్రిని కోరారు. గత 20 ఏళ్లుగా కాలనీలో నివసిస్తున్న అర్హులైన పేద కుటుంబాలను గుర్తించి, వారికి నివాస స్థలాలపై హక్కులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీర్ఘకాలంగా అక్కడే నివసిస్తున్న కుటుంబాలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు.
కాలనీలోని పేద కుటుంబాల నివాస సమస్యను మానవీయ కోణంలో పరిశీలించాలని జనసేన నాయకులు కోరారు. గుడిసెల కూల్చివేత ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు, అర్హులైన కుటుంబాలకు ఇంటి పట్టాలు అందించాలని స్పష్టం చేశారు. పేద ప్రజలు నివాస హక్కుల కోసం ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ పద్మజ దేవి, గాదె పృథ్వీతో పాటు జనసైనికులు పిట్టల మధుసూదన్, గుండెకారి రవితేజ పాల్గొన్నారు. వైఎస్సార్ నగర్ కాలనీకి చెందిన భవాని, శిరీష, యాసిన్, సాయి కుమార్, అంజలి తదితరులు కూడా వినతిపత్రం అందజేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. కాలనీవాసుల సమస్యలను ప్రభుత్వం పరిశీలించి, తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

మొదటిపేజీ తరువాయి

మూసీ రివర్ ఫ్రంట్‌తో హైదరాబాద్‌కు కొత్త రూపు

హైదరాబాద్‌లోని బంజారా భవన్‌లో రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ విద్యా దినోత్సవం, మైనారిటీ సంక్షేమ దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు ప్రాధాన్యతను వివరించారు. మూసీ పరిసర ప్రాంతాలను అత్యంత సుందరమైన రివర్ ఫ్రంట్‌గా తీర్చిదిద్దడంతో పాటు, అక్కడ రాత్రి వేళల్లో ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. నైట్ ఎకానమీ అభివృద్ధి చెందితే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు.మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి హైదరాబాద్ నగరానికి కొత్త ఆకర్షణగా నిలవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ముఖ్యమంత్రి తెలిపారు. దేశ, విదేశాల నుంచి పర్యాటకులు నగరానికి వచ్చేలా ఈ ప్రాంతాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. నైట్ ఎకానమీ కార్యకలాపాల విస్తరణతో స్థానికంగా వ్యాపారాలు, ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా రాష్ట్ర ఆర్థిక పురోగతికి కూడా తోడ్పాటు లభిస్తుందని వివరించారు. హైదరాబాద్ గత వైభవాన్ని గుర్తుచేస్తూ, నగరంలోని ఓల్డ్ సిటీని మాత్రమే కాకుండా అసలైన హైదరాబాద్ నగర వైభవాన్ని తిరిగి పునరుద్ధరించేందుకు చర్యలు చేపడుతున్నామని అన్నారు. మూసీ పరిసరాల అభివృద్ధి ద్వారా నగరానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలన్నది ప్రభుత్వ ఆలోచనగా వెల్లడించారు. భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు. మౌలానా ఆజాద్ విద్యాశాఖ మంత్రిగా ఉన్న సమయంలోనే దేశంలో ఐఐటీల స్థాపనకు శ్రీకారం చుట్టారని తెలిపారు. దేశ విద్యా విధాన రూపకల్పనతో పాటు ప్రముఖ విద్యాసంస్థల ఏర్పాటుకు ఆయన పునాదులు వేశారని, తద్వారా భారతదేశ విద్యారంగ అభివృద్ధికి విశేష సేవలందించారని కొనియాడారు.

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలో వచ్చే ఏడాది నుంచి 12వ తరగతి వరకు విద్యా విధానం

హైదరాబాద్, నవంబర్ 11 అక్షరం న్యూస్

: విద్యార్థుల ప్రయోజనాలే లక్ష్యంగా రాష్ట్రంలో విద్యా సంస్కరణలు చేపడుతున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. నర్సరీ నుంచి విశ్వవిద్యాలయం వరకు నాణ్యమైన విద్యాబోధన అందించడంతో పాటు ఆధునిక ప్రపంచ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. విద్యాశాఖపై ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి 12వ తరగతి వరకు విద్యా విధానాన్ని అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. కొత్త విద్యా విధానంలో నర్సరీ నుంచి నాలుగో తరగతి వరకు ప్రాథమిక విద్యగా, ఐదు నుంచి ఎనిమిదో తరగతి వరకు సెకండరీ విద్యగా, తొమ్మిది నుంచి పన్నెండో తరగతి వరకు సీనియర్ సెకండరీ విద్యగా విభజించాలని సూచించారు. పన్నెండో తరగతి పూర్తయ్యే నాటికి విద్యార్థులకు భాషా పరిజ్ఞానం, సమాచార నైపుణ్యాలపై పూర్తి పట్టు ఉండేలా బోధన సాగాలని చెప్పారు. ఆ తర్వాత విద్యార్థులు తమ ఆసక్తికి అనుగుణంగా సబ్జెక్టులను ఎంచుకుని వాటిలో నైపుణ్యం సాధించేలా అవకాశాలు కల్పించాలన్నారు. పదో తరగతి తర్వాత సగటున 40 శాతం మంది విద్యార్థులు చదువును మధ్యలోనే ఆపేస్తున్నారని ముఖ్యమంత్రి సమీక్షలో ప్రస్తావించారు. వీరిలో బాలికలు, దళిత, గిరిజన, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థుల సంఖ్య అధికంగా ఉంటోందని తెలిపారు. పన్నెండో తరగతి వరకు విద్య కొనసాగించే కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో చదువు మానేసే వారి సంఖ్య తక్కువగా ఉందని పేర్కొన్నారు. దేశంలోని 18 రాష్ట్రాల్లో ఇప్పటికే పన్నెండో తరగతి వరకు విద్యా విధానం అమల్లో ఉందని, విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తెలంగాణలోనూ ఈ విధానాన్ని తీసుకొస్తున్నట్లు వివరించారు. జూనియర్ కళాశాలల అధ్యాపకులు, బోధనేతర సిబ్బందికి పదవీ విరమణ ప్రయోజనాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

డిసెంబర్ నెలాఖరులోగా రెడకుంట ఎతిపోతల పథకం పూర్తి చేయాలి: మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి

సూర్యాపేట, నవంబర్ 11అక్షరం న్యూస్ :

కోదాడ నియోజకవర్గంలోని రెడ్లకుంట ఎత్తిపోతల పథకం పనులను డిసెంబర్ నెలాఖరులోగా పూర్తి చేసి ప్రారంభించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ప్రాజెక్టు నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల ప్రస్తుత స్థితి, నిర్మాణంలో సాధించిన పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్ణయించిన గడువులోగా పథకాన్ని పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేయాలని, పనుల్లో ఎలాంటి జాప్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు. ప్రాజెక్టు నిర్మాణ పనుల పరిశీలన సందర్భంగా మంత్రి సంబంధిత అధికారులతో వివరంగా చర్చించారు. ఇప్పటివరకు పూర్తయిన పనులు, కొనసాగుతున్న పనులు, ఇంకా పూర్తి చేయాల్సిన అంశాలపై సమీక్ష నిర్వహించారు. నిర్మాణ పనుల వేగాన్ని మరింత పెంచాలని, గడువుకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగాలని సూచించారు. ప్రాజెక్టు పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్దిష్ట లక్ష్యాలను చేరుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. పనుల విషయంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ప్రదర్శించకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో నల్గొండ ఎంపీ కే. రఘువీర్‌రెడ్డి మంత్రి వెంట పాల్గొన్నారు. ప్రాజెక్టు పనులను ఇద్దరూ కలిసి పరిశీలించి, అక్కడి పరిస్థితులను అధికారుల నుంచి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, నీటిపారుదల శాఖ ముఖ్య ఇంజినీర్ నాగభూషణం, ఇతర నీటిపారుదల శాఖ అధికారులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన నిర్మాణ పురోగతి, పనుల నిర్వహణ తదితర అంశాలపై అధికారులు మంత్రికి వివరాలు అందించారు. రెడ్లకుంట ఎత్తిపోతల పథకం పనులను డిసెంబర్ చివరి నాటికి పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఉత్తమ్ కుమార్‌రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. ఇందుకోసం నిర్మాణ సంస్థ అవసరమైన పనరులను సమకూర్చుకుని పనులను వేగవంతం చేయాలని సూచించారు. పనుల నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను అధికారులు వెంటనే గుర్తించి పరిష్కరించాలని, వాటి కారణంగా ప్రాజెక్టు పూర్తి ఆలస్యం కాకుండా చూడాలని ఆదేశించారు. గడువును దృష్టిలో ఉంచుకుని ప్రతి దశలో పనుల పురోగతిని పరిశీలించాలని సూచించారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యే వరకు అధికారులు, కాంట్రాక్టర్ సమన్వయంతో పనిచేయాలని మంత్రి పేర్కొన్నారు. పనుల నాణ్యతతో పాటు నిర్దిష్ట సమయంలో పూర్తి చేయడానికి ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. డిసెంబర్ నెలాఖరును తుది గడువుగా నిర్దేశిస్తూ, అప్పటిలోగా రెడ్లకుంట ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను హెచ్చరించారు. ఈ పర్యటన ద్వారా ప్రాజెక్టు పనుల పురోగతిని స్వయంగా పరిశీలించిన మంత్రి, గడువు పాటించడంలో ఎలాంటి అలసత్వం ఉండకూడదని స్పష్టం చేశారు.

చెన్నైలో రాపిడ్ హెచ్‌వీ అనుభవ కేంద్రం ప్రారంభం

మొదటిపేజీ తరువాయి

చెన్నై, నవంబర్ 11అక్షరం న్యూస్

తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ బుధవారం చెన్నైలో కొత్తగా ఏర్పాటు చేసిన రాపిడ్ హెచ్‌వీ ఫ్లాగ్‌షిప్ అనుభవ కేంద్రాన్ని ప్రారంభించారు. సచివాలయం నుంచి దృశ్యమాధ్యమం ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రారంభోత్సవం నిర్వహించారు. చెన్నైలోని పెరుంగుడి ప్రాంతంలో ఓఎంఆర్ రోడ్డుపై ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మూడు అంతస్తులతో నిర్మించిన ఈ కేంద్రం విద్యుత్ ద్విచక్ర వాహన రంగంలో సంస్థ కార్యకలాపాలకు కీలక వేదికగా నిలవనుంది.భారత్‌లో అధిక వోల్టేజీ విద్యుత్ మోటార్‌సైకిళ్ల తయారీలో ముందున్న సంస్థగా రాపిడ్ హెచ్‌వీ గుర్తింపు పొందింది. సంప్రదాయ ఇంధన వాహనాలకు ప్రత్యామ్నాయంగా విద్యుత్ వాహనాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఈ సంస్థ ప్రత్యేకత సంతరించుకుంది. అధిక వోల్టేజీ సాంకేతికత ఆధారంగా విద్యుత్ మోటార్‌సైకిళ్లను అభివృద్ధి చేయడంపై సంస్థ దృష్టి సారిస్తోంది. ఈ రంగంలో కొత్త సాంకేతికతను ప్రజలకు పరిచయం చేసేందుకు అనుభవ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది.మూడు అంతస్తుల్లో విస్తరించిన ఈ కేంద్రం ద్వారా సంస్థ విద్యుత్ మోటార్‌సైకిళ్లను ప్రజలకు పరిచయం చేయనుంది. వాహనాల రూపకల్పన, సాంకేతికత, పనితీరు వంటి అంశాలను వినియోగదారులు ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ఈ కేంద్రం ఉపయోగపడనుంది. విద్యుత్ వాహనాలపై ఆసక్తి ఉన్నవారికి సంస్థ ఉత్పత్తులను దగ్గరగా పరిశీలించే అవకాశం కల్పించడమే ఇటువంటి అనుభవ కేంద్రాల ప్రధాన ఉద్దేశం. తమిళనాడులో విద్యుత్ వాహన రంగం అభివృద్ధికి ప్రాధాన్యత పెరుగుతున్న తరుణంలో ఈ కేంద్రం ప్రారంభం ప్రాధాన్యత సంతరించుకుంది. చెన్నైలోని ఓఎంఆర్ ప్రాంతం సమాచార సాంకేతిక, వాణిజ్య కార్యకలాపాలకు కీలక కేంద్రంగా ఉండటంతో ఇక్కడ అనుభవ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం సంస్థకు వ్యాపారపరంగా ఉపయోగకరంగా మారనుంది. అయితే కేంద్రం ప్రారంభోత్సవానికి సంబంధించిన కార్యక్రమ వివరాలు మినహా సంస్థ భవిష్యత్తు విస్తరణ ప్రణాళికలపై మరిన్ని వివరాలు వెల్లడికాలేదు.
సచివాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన ఈ కార్యక్రమంతో రాపిడ్ హెచ్‌వీ సంస్థకు చెందిన కొత్త ఫ్లాగ్‌షిప్ కేంద్రం అందుబాటులోకి వచ్చింది. విద్యుత్ ద్విచక్ర వాహనాలపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు ఆధునిక సాంకేతికతను పరిచయం చేయడంలో ఈ కేంద్రం తోడ్పడనుంది. దేశంలో విద్యుత్ వాహనాల వినియోగం విస్తరిస్తున్న నేపథ్యంలో ఇటువంటి కేంద్రాలు వినియోగదారులకు కొత్త అనుభవాన్ని అందించే అవకాశముంది.

రాష్ట్రంలో వచ్చే ఏడాది నుంచి 12వ తరగతి వరకు విద్యా విధానం

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్, నవంబర్ 11

అక్షరం న్యూస్

విద్యార్థుల ప్రయోజనాలే లక్ష్యంగా రాష్ట్రంలో విద్యా సంస్కరణలు చేపడుతున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. నర్సరీ నుంచి విశ్వవిద్యాలయం వరకు నాణ్యమైన విద్యాబోధన అందించడంతో పాటు ఆధునిక ప్రపంచ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. విద్యాశాఖపై ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి 12వ తరగతి వరకు విద్యా విధానాన్ని అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.కొత్త విద్యా విధానంలో నర్సరీ నుంచి నాలుగో తరగతి వరకు ప్రాథమిక విద్యగా, ఐదు నుంచి ఎనిమిదో తరగతి వరకు సెకండరీ విద్యగా, తొమ్మిది నుంచి పన్నెండో తరగతి వరకు సీనియర్ సెకండరీ విద్యగా విభజించాలని సూచించారు. పన్నెండో తరగతి పూర్తయ్యే నాటికి విద్యార్థులకు భాషా పరిజ్ఞానం, సమాచార నైపుణ్యాలపై పూర్తి పట్టు ఉండేలా బోధన సాగాలని చెప్పారు. ఆ తర్వాత విద్యార్థులు తమ ఆసక్తికి అనుగుణంగా సబ్జెక్టులను ఎంచుకుని వాటిలో నైపుణ్యం సాధించేలా అవకాశాలు కల్పించాలన్నారు.పదో తరగతి తర్వాత సగటున 40 శాతం మంది విద్యార్థులు చదువును మధ్యలోనే ఆపేస్తున్నారని ముఖ్యమంత్రి సమీక్షలో ప్రస్తావించారు. వీరిలో బాలికలు, దళిత, గిరిజన, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థుల సంఖ్య అధికంగా ఉంటోందని తెలిపారు. పన్నెండో తరగతి వరకు విద్య కొనసాగించే కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో చదువు మానేసే వారి సంఖ్య తక్కువగా ఉందని పేర్కొన్నారు. దేశంలోని 18 రాష్ట్రాల్లో ఇప్పటికే పన్నెండో తరగతి వరకు విద్యా విధానం అమల్లో ఉందని, విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తెలంగాణలోనూ ఈ విధానాన్ని తీసుకొస్తున్నట్లు వివరించారు. జూనియర్ కళాశాలల అధ్యాపకులు, బోధనేతర సిబ్బందికి పదవీ విరమణ ప్రయోజనాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తామని హామీ ఇచ్చారు.
రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు అద్దె భవనాల్లో కొనసాగడానికి వీల్లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అవసరమైన భవనాలను పూర్తిస్థాయి వసతులతో నిర్మించేందుకు కార్యాచరణ రూపొందించాలని, ఇందుకు అవసరమైన నిధులు విడుదల చేస్తామని తెలిపారు. యంగ్ ఇండియా సమగ్ర రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణ పురోగతిని సమీక్షించి, పనుల్లో వేగం పెంచి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.
నగర పరిధిలోని క్యూర్ ప్రాంతంలో నిర్మిస్తున్న పాఠశాలల పనులపైనా సమీక్ష నిర్వహించి, అవసరమైన చోట ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.ఐటీఐలను అధునాతన సాంకేతిక కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేసిన తర్వాత విద్యార్థుల నమోదు పెరగడంతో పాటు శిక్షణ పొందిన వారికి ఉద్యోగాలు లభించాయని ముఖ్యమంత్రి తెలిపారు.
పాలిటెక్నిక్ కళాశాలల ఆధునికీకరణకు అవసరమైన నిధుల విడుదలను వేగవంతం చేయాలని ఆదేశించారు. విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్, అసోసియేట్, ఇతర ప్రొఫెసర్ల నియామక ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. నియామకాల్లో నిబంధనలు కచ్చితంగా పాటించాలని, ఉన్నత విద్యామండలి ఛైర్మన్, విశ్వవిద్యాలయాల ఉపకులపతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. ఈ సమీక్షలో ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, పి. సుదర్శన్‌రెడ్డి, ఎంపీ వేమ్ నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి, ఉస్మానియా, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీల ఉపకులపతులు, విద్యాశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రత్యేక డ్రైవ్‌పై సమీక్ష సమావేశం

గ్రామీణ ప్రాంతాల్లో నిరంతరం సురక్షిత తాగునీటి సరఫరాకు ప్రణాళిక

నవంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహణ

పాల్గొన్న సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అధికారులు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ ములకలపల్లి /నవంబర్ 11/ అక్షరం న్యూస్:

ములకలపల్లి మండలంలోని రైతు వేదికలో బుధవారం ఎల్‌నినో ప్రత్యేక డ్రైవ్ నిర్వహణపై మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో తాగునీటి సరఫరా తీరుతెన్నులు, మౌలిక వసతుల కల్పనపై ఈ సమావేశంలో కూలంకషంగా చర్చించారు. మండలంలోని సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు హాజరైన ఈ సమావేశానికి ఇంట్రా, గ్రిడ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఎంపీడీఓ మరియు ఎంపీఓ విచ్చేశారు.ఈ నెల 15వ తేదీ నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు చేపట్టనున్న ఎల్‌నినో ప్రత్యేక డ్రైవ్‌ను విజయవంతం చేయడంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామాల్లో ప్రజలకు ఎటువంటి నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. గ్రామాల్లోని ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా సురక్షితమైన తాగునీటిని అందించడం, బోర్లు, చేతిపంపులు, ఓపెన్ వెల్స్ మరియు ఇతర తాగునీటి వనరుల ప్రస్తుత స్థితిగతులను క్షుణ్ణంగా తనిఖీ చేయడంపై చర్చించారు. అలాగే ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్ల (ఓహెచ్ఎస్ఆర్) శుభ్రతను పాటించడంతో పాటు, క్రమం తప్పకుండా క్లోరినేషన్ ప్రక్రియను పర్యవేక్షించాలని నిర్ణయించారు. ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ద్వారా సక్రమంగా నీరు అందుతున్నాయా లేదా అనే అంశాన్ని పరిశీలించాలని, అవసరమైన గ్రామాల్లో పంచాయతీల పరిధిలో నీటి ట్యాంకర్లను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచి ప్రత్యామ్నాయ సరఫరాకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి గ్రామ స్థాయి తాగునీటి సరఫరా చెక్‌లిస్ట్‌లు మరియు సంబంధిత రిజిస్టర్లను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఎల్‌నినో ప్రత్యేక డ్రైవ్ కాలంలో గ్రామీణ ప్రజలకు తాగునీటి పరంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు, గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పరస్పర సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేయాలని సమావేశంలో స్పష్టం చేశారు. ప్రజలకు నిరంతరం సురక్షితమైన తాగునీటిని అందించడమే ఈ ప్రత్యేక డ్రైవ్ ప్రధాన లక్ష్యమని అధికారులు వెల్లడించారు.

హెచ్ఆర్ఏజేలో నూతన జిల్లా కమిటీ సభ్యులకు అభినందనలు

- రాజ్యాంగం కల్పించిన మౌలిక హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించాలి

- జాతీయ అధ్యక్షుడు నందం నరసింహారావు

రామగిరి, పెద్దపల్లి జిల్లా, సెప్టెంబర్ 10 (అక్షరం న్యూస్):



హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (హెచ్ఆర్ఏజే) జాతీయ అధ్యక్షుడు నందం నరసింహారావు ఆధ్వర్యంలో పెద్దపల్లి పట్టణంలో సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర వెల్ఫేర్ సెక్రటరీ సిరారపు వెంకటేష్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో సంస్థలో నూతనంగా చేరిన జిల్లా స్థాయి కమిటీ సభ్యులను ఘనంగా అభినందించారు.ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షుడు నందం నరసింహారావు మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో సంస్థను మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని సూచించారు. సంస్థ విధివిధానాలు, లక్ష్యాలు, బాధ్యతలను సభ్యులకు వివరించారు. భారత రాజ్యాంగం మనకు కల్పించిన మౌలిక హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. సమాజంలో ఎక్కడ అన్యాయం జరిగినా బాధితులకు అండగా నిలిచి, వారికి న్యాయం జరిగేలా చట్టపరంగా పోరాటం చేయాలని సభ్యులకు పిలుపునిచ్చారు. మానవ హక్కుల పరిరక్షణే లక్ష్యంగా ప్రతి సభ్యుడు సామాజిక బాధ్యతతో పనిచేస్తూ సమాజానికి తన వంతు సేవ అందించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు నందం నరసింహారావు, తెలంగాణ రాష్ట్ర వెల్ఫేర్ సెక్రటరీ సిరారపు వెంకటేష్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు దోమటి కిరణ్ కుమార్, జిల్లా జనరల్ సెక్రటరీ కొండవీన ప్రభాకర్ యాదవ్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ పవన్ కళ్యాణ్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బెల్లం సదానందం, జిల్లా వైస్ ప్రెసిడెంట్ కాసు తిరుపతి, రామగిరి మండల అధ్యక్షుడు గిరవేణి రాములు తదితరులు పాల్గొన్నారు.

నిలిచిపోయినహై లెవల్ బ్రిడ్జి పనులు పునఃప్రారంభం

రూ.80 కోట్ల నిధుల కేటాయింపు..

ఓదెల - జమ్మికుంటకు తగ్గనున్న దూరం.ప్రభుత్వ విప్

ఓదెల/నవంబర్ 11(అక్షరం న్యూస్)





ఓదెల మండలం రూపనారాయణపేట మానేరు వాగుపై జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామం వరకు రూ. 80 కోట్ల నిధులతో నిర్మించనున్న హై లెవల్ బ్రిడ్జి పనులను తిరిగి పునఃప్రారంభించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గతంలో 80 కోట్ల నిధులతో మానేరు బ్రిడ్జిపై హై లెవెల్ వంతెనను నిర్మించేందుకు పనులు ప్రారంభించిన అనివార్య కారణాలవల్ల కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నిలిచిపోవడంతో మళ్లీ పనులను పునర్ ప్రారంభించుకోవడం జరిగిందని సునంద రా కంపెనీ కాంట్రాక్టర్ దీన్ని త్వరలోనే పూర్తి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు మానేరు వాగుపై జమ్మికుంట మండలం విలాసాగర్ వరకు అవసరమైన హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం కోసం రూ. 80 కోట్ల నిధులను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఓదెల, కాల్వ శ్రీరాంపూర్, సుల్తానాబాద్ మండలాల నుండి జమ్మికుంట, హుజురాబాద్, వరంగల్ వెళ్ళే ప్రజలకు వీలుగా వారి దూర భారాన్ని తగ్గించే విధంగా రూపునారాయణపేట మానేరు వాగుపై హై లెవల్ వంతెన నిర్మించడం జరుగుతుందని దాని వల్ల తరచూ పెద్దపల్లి నియోజకవర్గం నుండి జమ్మికుంట మరియు జమ్మికుంట, హుజురాబాద్ నుండి పెద్దపల్లి కి వచ్చే ప్రజలకు ప్రయాణ దూరం మరియు సమయం తగ్గుతుందని అన్నారు. రూపునారాయణపేట మానేరు వాగుపై హై లెవల్ వంతెన నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలను పాటించి నిర్ణీత గడువులోగా ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఏ ఈ గుణశేఖర్ రెడ్డి సంబంధిత ప్రభుత్వ అధికారులు, సింగిల్ విండో చైర్మన్, ఆళ్ల సుమన్ రెడ్డి నాయకులు ఆకుల మహేందర్ సర్పంచులు బొంగోని రమ శ్రీనివాస్ గౌడ్ పలు గ్రామాల సర్పంచ్ లు, ఉపసర్పంచ్ లు మరియు పలువురు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ,యూత్ నాయకులు, గ్రామాల ప్రజలు మరియు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘం భవనాల నిర్మాణానికి భూమిపూజ చేసిన ప్రభుత్వ విప్

ఓదెల/ నవంబర్ 11(అక్షరం న్యూస్)

ఓదెల మండలం: మండలంలోని కొలనూరు, రూపునారాయణపేట, బాయమ్మపల్లి, గుంపుల గ్రామాల్లో దాదాపు 40 లక్షల వ్యయంతో మహిళా సంఘం భవనాల నిర్మాణానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు భూమిపూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మహిళా సంఘాల భవనాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. మహిళా సంఘాల బలోపేతానికి, మహిళలు సమావేశాలు నిర్వహించుకోవడానికి, స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా కొనసాగించడానికి ఈ భవనాలు ఉపయోగపడనున్నాయి. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తూ, స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు. మహిళా సంఘాలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అనిల్ రెడ్డి వ్యవసాయ అధికారి భాస్కర్ సింగిల్ విండో చైర్మన్ మాజీ సర్పంచ్లు ఆకుల మహేందర్ సామ శంకర్ అంకం రమేష్ మరియు సర్పంచులు చిట్ల రామ్ ముదిరాజ్ బొంగోని రమా శ్రీనివాస్ గౌడ్ పడాల భాగ్యలక్ష్మి రాజు పటేల్ స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



రైస్‌మిల్లులో హమాలీగా పనిచేస్తున్న యువకుడు మృతి

సూర్యాపేట నేరేడుచర్ల నవంబర్ 11అక్షరం న్యూస్



నేరేడుచర్ల మండలం దిర్శించర్ల గ్రామంలోని సాయి హనుమాన్ రైస్‌మిల్లులో హమాలీగా పనిచేస్తున్న బీహార్‌కు చెందిన రామ్ దయాల్ కుమార్ (26) మంగళవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైనట్లు తెలుస్తోంది. బీహార్‌లోని బంధువులు ఫోన్‌లో గొడవపడిన అనంతరం రాత్రి 10 గంటల సమయంలో అతడు కనిపించకపోవడంతో తోటి కార్మికులు వెతకగా, మిల్లు సమీపంలోని పొలంలో చెట్టుకు ఉరివేసుకున్న స్థితిలో కనిపించాడు. వెంటనే వారు ఉరిని తొలగించి గదికి తీసుకెళ్లి మిల్లు గుమస్తా పసుపుల దీవన్‌రాజ్‌కు సమాచారం అందించారు. ఆయన 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో రామ్ దయాల్‌ను మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి బాబాయి సుధీర్ మాతం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సదాశయ ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్‌కు 'నేషనల్ సేవా ధార్మిక్ అవార్డు ప్రధానం

- 18 ఏళ్లుగా నేత్ర, అవయవ, శరీరదానాలపై అవగాహన..

సామాజిక సేవలకు పురస్కారం

జ్యోతి నగర్ ఎన్టిపిసి నవంబర్ 11 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

సేవ చేయాలనే సంకల్పం.. మరణానంతరం కూడా మరికొందరి జీవితాల్లో వెలుగులు నింపాలనే ఆశయం.. ఈ లక్ష్యంతో 18 ఏళ్లుగా నేత్ర, అవయవ, శరీరదానాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సదాశయ ఫౌండేషన్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఫౌండేషన్ సేవలను గుర్తించిన హైదరాబాద్‌కు చెందిన లతా రాజా ఫౌండేషన్ 'నేషనల్ సేవా ధార్మిక్ అవార్డు'తో సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు టి. శ్రవణ్ కుమార్‌ను సత్కరించింది.కరీంనగర్‌లోని వి కన్వెన్షన్‌లో మంగళవారం రాత్రి నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో పలువురు ప్రముఖులు ఈ పురస్కారాన్ని అందజేశారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం (ఐపీఎస్), ప్రముఖ సామాజిక సేవకుడు సూర్యం (గద్దర్ కుమారుడు), లతా రాజా ఫౌండేషన్ ఛైర్మన్ కె.కె. రాజా, పద్మభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ వరప్రసాద్ రెడ్డి, అఖిల భారత అవయవ, శరీరదాతల సంఘం ఛైర్మన్ డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి తదితరులు శ్రవణ్ కుమార్‌ను ఘనంగా సత్కరించి అభినందించారు.

సేవకు ప్రోత్సాహం.. మరింత బాధ్యత

ఈ అవార్డు సదాశయ ఫౌండేషన్ చేస్తున్న సేవలకు దక్కిన గుర్తింపుగా ప్రతినిధులు పేర్కొన్నారు. పురస్కారం అందుకున్న శ్రవణ్ కుమార్‌కు ప్రతిమ మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణారెడ్డి, ప్రొఫెసర్లు డాక్టర్ టి.కె.కె. నాయుడు, డాక్టర్ ప్రణయ్ కుమార్‌తో పాటు సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు, వివిధ స్వచ్ఛంద సంస్థల నాయకులు అభినందనలు తెలిపారు.

ప్రతినిధుల హర్షం వ్యక్తం...

శ్రవణ్ కుమార్ పురస్కారం అందుకోవడం పట్ల కమాన్పూర్ లయన్ క్లబ్ అధ్యక్షులు సానా రామకృష్ణారెడ్డి, సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు నూక రమేష్, లింగమూర్తి, డాక్టర్ భీష్మాచారి, వాసు, రాజిరెడ్డి, చంద్రమౌళి, ఏ. రాజమౌళి, కవిత, అనంతరాములు, అన్నపూర్ణ, నరహరి, శంకర్ రావు, దళపతి, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, రాములు, ఎల్. రాజమౌళి, గాయకుడు వెంకన్న, సతీష్, మల్లేశం, డీలర్ వెంకన్న, రాజలింగయ్య, కనకయ్య, సుగేందర్ రావు, సారయ్య, సమ్మయ్య తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



రహదారిపై గుంతలు పూడ్చి ప్రమాదాల నివారణకు చర్యలు

- జాతీయ రహదారి - 65పై ఈనాడు ఆఫీస్ జంక్షన్ వద్ద గుంతల పూడ్చివేత

సూర్యాపేట టౌన్ నవంబర్ 11అక్షరం న్యూస్

సూర్యాపేట పట్టణ పరిధిలోని జాతీయ రహదారి--65పై ఈనాడు ఆఫీస్ జంక్షన్ వద్ద రహదారిపై గుంతలు ఏర్పడి వాహనదారులకు ప్రమాదకరంగా మారడంతో జిల్లా ఎస్పీ కె. నరసింహ, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ పోలీసులు తక్షణ చర్యలు చేపట్టారు. ఈరోజు ట్రాఫిక్ పోలీసులు రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చివేయించారు. వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు.ఈ సందర్భంగా సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. వాహనదారులు రహదారులపై ప్రయాణించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, వేగాన్ని నియంత్రించుకొని నిదానంగా వాహనాలు నడపాలని సూచించారు. రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షిత ప్రయాణం చేయాలని కోరారు.



జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

నేరేడుచర్లలో టీఎస్‌యూటీఎఫ్ కరపత్రాలు ఆవిష్కరణ

సూర్యాపేట నేరేడుచర్ల నవంబర్ 11అక్షరం న్యూస్

టీఎస్‌యూటీఎఫ్ సూర్యాపేట జిల్లా 6వ మహాసభలను జయప్రదం చేయాలని నేరేడుచర్ల మండల శాఖ నాయకులు ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు.2026 నవంబర్ 14, 15 తేదీలలో హుజూర్‌నగర్ టౌన్ హాల్‌లో జరగనున్న సూర్యాపేట జిల్లా 6వ మహాసభల కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం జెడ్పీహెచ్ఎస్ నేరేడుచర్ల పాఠశాల ఆవరణలో ఈరోజు మధ్యాహ్న సమయంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ నేరేడుచర్ల మండల శాఖ అధ్యక్షులు ఆర్. శ్రీనయ్య, ప్రధాన కార్యదర్శి బి. అక్కయ్య బాబు కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, విద్యారంగం బలోపేతం, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ వంటి అంశాలపై జిల్లా మహాసభలలో విస్తృతంగా చర్చ జరుగుతుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు అత్యధిక సంఖ్యలో హాజరై మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.సమావేశంలో మండలంలోని ఉపాధ్యాయులందరూ ఐక్యంగా ఉండి సంఘాన్ని బలోపేతం చేయాలని, మహాసభలకు సంబంధించిన ఏర్పాట్లపై కూడా చర్చించారు. ప్రతి పాఠశాల నుంచి ఉపాధ్యాయులు తప్పకుండా పాల్గొనేలా చూడాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఎండీ రషీద్ ఖాన్ తో పాటు ఎన్. నరసింహారావు, కె. వెంకటేశ్వరరావు, వై. జానయ్య, ఎ. అన్నపూర్ణ, ఎస్డీ హాజ్రున్, ఎం. యాదగిరి, ఆర్. శౌరి, కె. శ్రీనివాస్, బి. భీకోజి, వి. రవీందర్ రెడ్డి తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మహిళలకు కుట్టు మిషన్, కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

- ఎన్టీపీసీ రామగుండం సీఎస్ఆర్ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు

జ్యోతినగర్, ఎన్టీపీసీ నవంబర్ 11 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

: మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించి, స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఎన్టీపీసీ రామగుండం సీఎస్ఆర్ విభాగం ఆధ్వర్యంలో కుట్టు మిషన్, కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. మరియా, దీప్తి మహిళా సమితుల సహకారంతో ఈ శిక్షణ తరగతులను ఏర్పాటు చేస్తున్నారు.కుట్టు మిషన్ శిక్షణ మూడు నెలల పాటు నిర్వహించనుండగా, 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల మహిళలు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. ఆసక్తి గలవారు నమోదు, ఇతర వివరాల కోసం అర్చన (6281046137)ను సంప్రదించాలి.అదేవిధంగా రెండు నెలల పాటు నిర్వహించే సర్టిఫైడ్ కంప్యూటర్ శిక్షణలో భాగంగా టాలీ, జీఎస్టీతో పాటు పీజీడీసీఏ కోర్సుల్లో శిక్షణ అందించనున్నారు. ఈ కోర్సులకు కూడా 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల మహిళలు అర్హులు. వివరాలు, నమోదు కోసం కీర్తన (9618246770)ను సంప్రదించాలి. రెండు శిక్షణ కార్యక్రమాలకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 16వ తేదీ చివరి గడువుగా నిర్ణయించారు. ఆసక్తి కలిగిన అర్హులైన మహిళలు గడువులోగా సంబంధిత ఫోన్ నంబర్లను సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

ఈ నెల 15న నల్గొండ లో జరిగే రైతు గర్జన సభను జయప్రదం చేయండి

సీతారామ డిస్ట్రిబ్యూటర్ కెనాల్ కాలువలు వెంటనే నిర్మించి జిల్లా రైతాంగానికి సాగు నీరు అందించాలి

మురసు తూఫాన్ కారణంగా పంటలు నష్టపోయిన రైతులను తక్షణమే అదుకోవాలి

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య డిమాండ్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ ములకలపల్లి /నవంబర్ 11 /అక్షరం న్యూస్ :

ఈ నెల 15న నల్గొండ లో జరిగే రైతు గర్జన సభలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య కోరారు. బుధవారం మండల కేంద్రము లోని సిపిఎం కార్యాలయంలో పోడియం వెంకటేశ్వర్లు అధ్యక్షతనలో జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశం లో ఆయన పాల్గొని మాట్లాడారు... పోరాటాల గడ్డ నల్లగొండ లో ఈ నెల 15 తేదీ నుంచి 18 తేదీ వరకు అఖిల భారత కిసాన్ సభ జాతీయ మహా సభలు జరుగనున్నాయని మొదటి రోజు 15వ తేదీన లక్షల మందితో భారీ బహిరంగ సభలో రైతులు, కార్మికులు,వ్యవసాయ కార్మికులు ఐక్యంగా నల్లగొండ సభకు వేలాదిగా కదిలి రావాలని పిలుపునిచ్చారు. దేశంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెడుతుందని విమర్శించారు. రైతులు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర లేక దేశంలోని రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని అన్నారు. ఈ రోజు దేశానికి అన్నం పెట్టే రైతన్న ఆర్థికంగా చితికి పోయి తెచ్చిన అప్పులు తీర్చలేక అప్పుల బాధలు భరించలేక కొందరు రైతులు హత్మ హత్యల పాలవుతున్నారని అన్నారు. రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఎరువులు విత్తనాలను సబ్సిడీ ద్వారా అందించాలని డిమాండ్ చేశారు. సీతారామ ప్రాజెక్టు కెనాల్ కాలువలకు లింక్ డిస్ట్రిబ్యూటర్ కెనాల్ కాలువలు వెంటనే నిర్మించి జిల్లా రైతాంగానికి సాగు నీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, మాలోతు రావూజ, నిమ్మల మధు, గుగులోతు దేవేందర్,వర్షా శ్రీరాములు,బైరు ప్రసాద్,కుంజా రాంమూర్తి,గోపగాని లక్ష్మీ నరసయ్య,గుగులోతు రవీందర్, కోండ్రు రాఘవయ్య, గడ్డం వెంకటేశ్వర్లు,మడకం మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.



నీటి కరువు పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉంది

రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలి - ప్రభుత్వ విప్

ఓదెల/ నవంబర్ 11 (అక్షరం న్యూస్)

ఓదెల మండలం రూపునారాయణపేట, బయమ్మపల్లి, గుంపుల ఇందుర్తి గూడెం గ్రామాల్లో ఐకేపీ సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావుఈ సందర్భంగా మాట్లాడుతూ తీవ్ర కరువు వచ్చే పరిస్థితి ఏర్పడుతుంది కావున రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపుకు మొగ్గు చూపాలని వరి పంట వేసి నష్టపోవద్దని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అనిల్ రెడ్డి వ్యవసాయ అధికారి భాస్కర్ ,సింగిల్ విండో చైర్మన్, సుమన్ రెడ్డి పలువురు సర్పంచ్లు, బొంగోని రమా శ్రీనివాస్ గౌడ్ పడాల భాగ్యలక్ష్మి రాజు పటేల్ ఉరవకొండ చెట్ల రామ్ మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్ అంకం రమేష్ సామ శంకర్ తోపాటు ఉపసర్పంచ్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు, మహిళా సంఘాలు, రైతులు మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు...



సెంటినరీ కాలనీలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

రూ.18,650 నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం..

నలుగురు అరెస్ట్.. మరొకరు పరారీ

జ్యోతినగర్, ఎన్టీపీసీ నవంబర్ 11 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ :

రామగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సెంటినరీ కాలనీలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్, రామగిరి పోలీసులు సంయుక్తంగా దాడి చేసి నలుగురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.18,650 నగదు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మరో వ్యక్తి పోలీసులకు చిక్కకుండా పరారయ్యాడు.పోలీసుల కథనం ప్రకారం.. సెంటినరీ కాలనీలో కొందరు వ్యక్తులు డబ్బులు పందెంగా పెట్టి అక్రమంగా మూడు ముక్కలాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం అందడంతో పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు నార్కోటిక్ టీమ్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్ నేతృత్వంలో దాడులు నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ దీకొండ రమేష్, రామగిరి ఎస్ఐ శ్రీనివాస్ తమ సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురిని పట్టుకున్నారు.అరెస్టయిన వారిలో సెంటినరీ కాలనీకి చెందిన సింగరేణి ఉద్యోగులు మట్టా ప్రశాంత్ (40), దొంతరవేణి సదానందం (37), బేగంపేట ఎక్స్‌రోడ్డుకు చెందిన ఎస్.కె. చాంద్ పాషా (30), పూర్ట కార్తీక్ (30) ఉన్నారు. అదే ప్రాంతానికి చెందిన మైలారపు అనిల్ పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. పట్టుబడిన నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం రామగిరి పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు అప్పగించారు. అక్రమంగా పేకాట ఆడినా, నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.



వేసవి నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

- కాలనీల్లో కుక్కలు, కోతుల బెడదను అరికట్టాలి..

- జీఎంకు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం వినతి

రామగిరి, పెద్దపల్లి జిల్లా, నవంబర్ 11 (అక్షరం న్యూస్):

రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకొని కార్మికుల కాలనీల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అదేవిధంగా కాలనీల్లో కుక్కలు, కోతుల బెడదను నివారించాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉపాధ్యక్షులు నాగెల్లి సాంబయ్య కోరారు. ఈ మేరకు మంగళవారం ఆర్జీ-3 జనరల్ మేనేజర్ మధుసూదన్‌ను కలిసి వినతిపత్రం (మెమోరాండం) అందజేశారు. వేసవిలో కార్మిక కుటుంబాలకు తాగునీటి సమస్యలు ఎదురుకాకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, కాలనీల్లో కుక్కలు, కోతుల సంచారంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వాటి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.దీనిపై జనరల్ మేనేజర్ మధుసూదన్ సానుకూలంగా స్పందిస్తూ, సమస్యల పరిష్కారానికి అవసరమైన నివారణ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సెంట్రల్ జాయింట్ సెక్రటరీ దేవ శ్రీనివాస్, సెంట్రల్ కమిటీ సభ్యులు కేశవరావు, పెద్ది స్వామి, డివిజన్ నాయకులు ఎండీ షరీఫ్, ఓసీపీ-1 ఫిట్ సెక్రటరీ గిటుకు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం!

- ధాన్యం కొనుగోళ్లకు శ్రీకారం రైతులకు భరోసా!

- వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ గజ్జెల సృజన రమేష్

హనుమకొండ జిల్లా/ భీమదేవరపల్లి/ నవంబర్ 11/ అక్షరం న్యూస్:-

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ప్రధాన ఉద్దేశమని వంగర గ్రామ సర్పంచ్ గజ్జెల సృజన రమేష్ అన్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలోని రైతు వేదిక వద్ద ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. రైతులు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దళారుల చేతుల్లో మోసపోకుండా నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని కోరారు. తద్వారా రైతులకు ధాన్యానికి సరైన ధర లభించడంతో పాటు ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించే సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా సజావుగా సాగేలా వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. రైతుల సంక్షేమం వ్యవసాయ రంగ అభివృద్ధికి గ్రామపంచాయతీ తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు పోచంపల్లి రాజిరెడ్డి, బొక్కల స్రవంతి, ఊస కోయిల ప్రకాష్, మొండయ్య, రమేష్, సతీష్, శారద, అశోక్, చింతరాజు, జక్కుల అనిల్, వెంకటేష్, వ్యవసాయ శాఖ ఏఓ, ఏఈఓ, గ్రామ కార్యదర్శి, వీరన్న నాయక్, సీసీ సదానందం, సీఏలు, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



కరీంనగర్లో తలపెట్టిన మహా పాదయాత్రను విజయవంతం చేయండి

బీజేపీ మండల అధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి

కరీంనగర్/ఇల్లందకుంట/నవంబర్ 11/ అక్షరం న్యూస్:

ఓటరు సమగ్ర సవరణ జాబితా (ఎస్ ఐ ఆర్)పై కాంగ్రెస్‌తో పాటు ఇతర ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలని బీజేపీ బైరెడ్డి రమణారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం రోజున ఇల్లందకుంట మండల కేంద్రం లో మండల పార్టీ అధ్యక్షులు బైరెడ్డి రమణారెడ్డి అధ్యక్షతన బీజేపీ ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీజేపీ జిల్లా కార్యదర్శి సంపెల్లి సంపత్ రావ్ మాట్లాడుతూ.. ఎస్-ఎస్ఆర్ విషయంలో కాంగ్రెస్ పార్టీ అనవసర రాద్ధాంతం చేస్తోందని మండిపడ్డారు.దశాబ్దాల పాటు దేశాన్ని ఏలిన కాంగ్రెస్ పార్టీ, బీజేపీని రాజకీయంగా ఎదుర్కొనే దమ్ము లేక విదేశీ శక్తులతో చేతులు కలిపి పనికిమాలిన రాజకీయాలు చేస్తోందని సంపత్ రావ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేశవ్యాప్తంగా ప్రజా విశ్వాసాన్ని కోల్పోయి తుడుచి పెట్టుకుపోయిన కాంగ్రెస్, దిక్కుతోచని స్థితిలోనే బీజేపీపై చిల్లర రాజకీయాలతో బురదజల్లే కుట్రలు చేస్తోందన్నారు. దేశంలో అశాంతిని రేకెత్తించి రాజకీయ పబ్బం గడుపుకోవాలని కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు చూస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ చేస్తున్న కుట్రలకు బుద్ధి చెప్పేందుకే ప్రజలు, యువత భాగస్వామ్యంతో కరీంనగర్‌లో ఈ మహా పాదయాత్రను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని, పార్టీ శ్రేణులంతా కష్టపడి కార్యక్రమాన్ని గ్రాండ్ సక్సెస్ చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి పడరాని పాట్లు పడుతుందని మండల అధ్యక్షులు బైరెడ్డి రమణారెడ్డి ఎద్దేవా చేశారు .దేశంలో ప్రజా విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ కి మనుగడ కష్టంగా మారిందని, అందుకే ప్రజల



దృష్టిని మరలించడానికి రకరకాల డ్రామాలు ఆడుతోందన్నారు. కాంగ్రెస్ పనికిమాలిన రాజకీయాలు ప్రజలు గ్రహిస్తున్నారని ,రాబోయే కాలంలో ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్కు తీవ్ర గుణపాఠం తప్పదని హెచ్చరించారు.ఈ సమావేశంలో మండల అధ్యక్షులు బైరెడ్డి రమణారెడ్డి, మండల ప్రధానకార్యదర్శి గుత్తికొండ రాంబాబు, ఉప్పుల రమేష్, కంకణాల రవీందర్ రెడ్డి, ఇంగ్లే ప్రభాకర్, నల్ల లింగారెడ్డి, తాళ్ల లావణ్య, చింతల ఐలయ్య, మడ్డి శ్రీనివాస్, కొక్కుల దేవేందర్,ఆసల సుధాకర్,ఉప్పు దుర్గయ్య, తుపాకుల సతీష్, జిల్లెల్ల శ్రీపాల్ రెడ్డి, మట్ట పవన్ రెడ్డి, దేవునూరి లచ్చన్న, పలకల కిషన్ రెడ్డి, గురుకుంట్ల సంజీవ్, చిట్ల శ్రీనివాస్,జోడు సంపత్, వడ్లకొండ జలపతి, మద్దూరి మల్లేష్, బెల్లం హరీష్, కనుమల్ల రాయమల్లు, చీపతి శ్రీకాంత్, రావుల అశోక్, శనిగరపు శ్రవణ్, కండె స్వామి దాస్,కొత్తూరి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ధైర్యంగా పోరాటం చేస్తేనే హక్కులు సాధించుకోగలం

-ఏ ఆఫీస్ చుట్టూ తిరుగొద్దు...వాళ్లే మన కాడికి రావాలే..
- రాజ్యం కోసమే రాజ్యాంగం పట్టుకుని తిరుగుతాండ్లు
- మన భూముల్లో బొగ్గు తీసి వ్యాపారం చేస్తున్న సింగరేణి
- ప్రాణం పోయే వరకు మీ హక్కుల కోసం పోరాటం చేస్తా
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ గారు

రామగిరి (పెద్దపల్లి జిల్లా) నవంబర్ 11 అక్షరం న్యూస్:

హక్కులు సాధించుకోవాలంటే ఏ ఆఫీసుల చుట్టూ తిరుగవద్దని, అధికారులే మన వద్దకు వచ్చేలా పోరాటం చేయాలని మంథనిమాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ సూచించారు. బుధవారం రామగిరి మండలం రాజాపూర్ గ్రామంలో నెలకొన్న సింగరేణి సమస్యలపై ఆయన గ్రామాన్ని సందర్శించి నిర్వాసితులతోమాట్లాడి భరోసా కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణి సమస్యలు పరిష్కారం కావాలంటే కలెక్టర్ కార్యాలయం, ఎస్‌డీసీ కార్యాలయాలకు వెళ్తే వాళ్లు చేస్తామని చెప్తరే కానీ ఏ ఒక్కటి చేయరని ఆయన వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి మూడేళ్లు గడుస్తున్నా రాజాపూర్ భూ నిర్వాసితులకు న్యాయం జరుగకపోవడం బాధాకరంగా ఉందని ఆయన వాపోయారు. దుద్దిళ్ల శ్రీధర్‌కు ఎప్పుడు అధికారం వస్తే అప్పుడు పల్లెలకు చీకటి వస్తుందని, ఆనాడు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పెద్దంపేట, మంగళిపల్లి, సింగరెడ్డిపల్లి, వకీలుపల్లి, లద్నాపూర్, అక్కెపల్లి, రచ్చపల్లి గ్రామాలకు చీకటే మిగిలిందని ఆయన వివరించారు. ఆ తర్వాత తనకు ఐదేండ్లు అవకాశం ఇస్తే అన్ని గ్రామాల్లోని సమస్యలను పారద్రోలానని ఆయన తెలిపారు. అధికారంలో లేనప్పుడు మా సారు ఫోన్‌లలోనే పనులు చేస్తడని గొప్పలు చెప్పిన నాయకులు ఈనాడు అధికారంలో ఉండి ముఖ్యమంత్రి తర్వాత ముఖ్యమంత్రినని చెప్పుకుంటున్న మంథని ఎమ్మెల్యే మూడేళ్లలో ఏం చేసిండో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కొత్త కొత్త చట్టాలు వస్తుంటాయని వాటిని అమలు చేయాల్సిన కలెక్టర్‌లు సైతం దుద్దిళ్ల శ్రీధర్ చెప్పే రాజ్యాంగాన్ని నడిపిస్తున్నారని ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో కలెక్టర్, ఎస్‌డీసీ వద్దకు పోతే పనులు ఎలా అవుతాయని ఆయన ప్రశ్నించారు. అందుకే మన ఇంటి గుమ్మం కాడ బడత పట్టుకుని కూర్చుంటేనే పనులు అవుతాయని ఆయన తేల్చి చెప్పారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత వకీలుపల్లిలో 50ఇండ్లు లేవని చెప్పారని, కానీ 109ఇండ్లకు పైసలు, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇప్పించానని తెలిపారు. సింగరెడ్డిపల్లి, పెద్దంపేట నిర్వాసితులకు స్థలం చూపించక రోడ్డున పడేశారని, పైసలు ఇచ్చాం ప్యాకేజీ లేదంటే ఇదెక్కడి న్యాయమని సింగరేణి అధికారులతో కొట్లాడి వాళ్ల మెడలు వంచి ప్యాకేజీ ఇప్పించిన చరిత్ర ఉందన్నారు. ఒక ఊరు పోతే ఆ ఊరితో ఉండే బంధాలు, చెట్టు, చేమలతో ఉండే బంధాలు పోతాయని, ఊళ్లను విడిచిపోవాలంటే ఎంత కష్టమో తెలుసు కనుకనే ఆనాడు పరిహారం ఇప్పించామని ఆయన గుర్తు చేశారు. ఆనాడు లద్నాపూర్‌కు మంథని ఎమ్మెల్యే బుల్డోజర్‌లు పంపించి ఇండ్లు కూలగొట్టాలని చూస్తే తాను అందుబాటులో లేకున్నా నా భార్యను పంపించి అడ్డుకున్నామని ఆయన గుర్తు చేశారు. ఈనాడు రాజాపూర్‌లో 800ఇండ్లకు పైసలు రావాల్సి ఉండగా కేవలం 400ఇండ్లకు వచ్చి మరో 400లకు ఇవ్వకుండా చూడటం అన్యాయమని, ఇందులో అందరూ గరీబోళ్లేనని ఆ 400ఇండ్లకు పరిహారం వచ్చే వరకు పోరాటం చేయాలన్నారు. మహబూబ్‌బాద్ లంబాడి గిరిజనులను ఆదర్శంగా తీసుకోవాలని, భూముల కోసం ముఖ్యమంత్రిని పరుగెత్తించారనే విషయాన్ని గుర్తించాలన్నారు. ఆనాడు అధికారంలో ఉండి ప్రతిపక్ష పాత్ర పోషించామని, ఈనాడు దుద్దిళ్ల శ్రీధర్ ఏనాడు ప్రజల పక్షాన నిలువడం లేదని ఆయన ఎద్దేవా చేశారు. దుద్దిళ్ల శ్రీధర్ ప్రతిపక్ష పాత్ర పోషించడం లేదని తామే ఆ పాత్ర పోషించి నిర్వాసితులకు పరిహారం, ఎక్స్‌గ్రేషియా, పెండ్లి అయిన ఆడబిడ్డలకు పైసలు ఇప్పించామని ఆయన గుర్తు చేశారు. మన భూములు తీసుకుని అందులోని బొగ్గు తీసుకుని సింగరేణి సంస్థ వ్యాపారం చేస్తుందని, అందులో వచ్చిన లాభాలను మనకు పరిహారం ఇస్తే నష్టమేంటని, వేల కోట్ల



ఆదాయం ఎటు పోతుందని ఆయన ప్రశ్నించారు. మనమంతా ధైర్యంగా ఉండాలని, భయం కల్పిస్తేనే పనులు చేస్తారని ఆయన భరోసా కల్పించారు. మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ ఎప్పుడు ఎమ్మెల్యేగా ఉన్నా అప్పుడు అందరికి అన్యాయమే చేసిండని, ఇటీవల లద్నాపూర్‌లోమాట్లాడిన తీరును అర్థం చేసుకోవాలన్నారు. మన పిల్లలకు ఉద్యోగాల కోసం పిసలేసి తిరుగుతాండ్లని అహంకారంతో మాట్లాడాడని, ఉద్యోగాలు ఇప్పించే అవకాశం ఉన్నా ఏ ఒక్కరికి ఉద్యోగం ఇప్పించకుండా అహంకారంతో మాట్లాడుతున్నాడన్నారు. ఓట్లు వస్తే డబ్బు సంచులతో వచ్చి మాయమాటలు, అబద్దాలు చెప్పి మళ్లీ అధికారంలోకి రావచ్చనే అహం ఉందన్నారు. 40ఏండ్లుగా ఆ కుటుంబాన్ని నమ్మి అవకాశం ఇస్తే హైదరాబాద్‌లోనే ఉంటున్నారని, ఇక్కడ వాళ్లకు ఎవరూ లేరని, ఈ ప్రాంతంతో దుద్దిళ్ల కుటుంబానికి ఓటు సంబంధం తప్ప పేగు బంధం లేదని, మనకు కష్టాలు వస్తే మంట కాగుతడే తప్ప కష్టాలు తీర్చడని అన్నారు. మంథనికి ఓ స్వామి వస్తున్నడు ఆయన కాళ్లు మొక్కాలని చెప్తున్నాడని, ఆయన కాళ్లు మొక్కితే కష్టాలు తీరుతాయా అని ప్రశ్నించారు. ఇక్కడే పుట్టి ఇక్కడే పెరిగానని, మీ కోసం ఏ పోరాటానికైనా సిద్దంగా ఉన్నానని, మీ హక్కుల కోసం ప్రాణం పోయినా భయపడేది లేదన్నారు. పుట్ట మధు నా కొడుకు అని గర్వంగా ఉండాలని, ఆయన అన్నారు. ఏ సమస్య వచ్చినా ఎక్కడకు వెళ్లకూడదని, ప్రభుత్వం, సింగరేణి మెడలు వంచి మన హక్కులు సాధించుకుందామని ఆయన భరోసా కల్పించారు. ఎన్నికల సమయంలో పెద్దంపేట మంగలిపల్లి వాసులకు ఇచ్చిన హామీ ప్రకారం అధికారులను తీసుకువచ్చి వాళ్ల సమస్యను పరిష్కరించానని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యం వచ్చే వరకే రాజ్యంగం పట్టుకు తిరుగుతారని, తెలంగాణాలో రాజ్యం కోసం రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ రాజ్యాంగం పట్టుకుని తిరిగారని, మళ్లీ ఈనాడు డిల్లీలో అధికారం కోసం రాజ్యాంగం పట్టుకుని తిరుగుతాండ్లని అన్నారు. తెలంగాణాలో అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రియాంక, రాహుల్‌గాంధీలు ఎక్కడైనా కనిపించారా అని ప్రశ్నించారు. మన బిడ్డలకు ఉద్యోగాల కోసం ధర్నా చేస్తుంటే వచ్చారా అని అన్నారు. ఆనాడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గొప్పగా ఆలోచన చేసి మన హక్కుల కోసం రాజ్యాంగం రాసిండని ఆయన గుర్తు చేశారు. ఈనాడు రాజాపూర్‌లో ఇళ్లు ఉన్నవి కానీ నివాసం ఉంటలేరని అంటున్నారని, నివాసం లేకపోతే పరిహారం ఇవ్వరా అని ప్రశ్నించారు. మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌కు మంథని, దన్వాడ, హైదరాబాద్‌లలో నాలుగు ఇండ్లు ఉన్నాయని, అందులో ఏ ఒక్కటైనా పోతే పరిహారం తీసుకోడా అని ప్రశ్నించారు. ప్రజల కోసం సింగరేణి సంస్థ పని చేస్తలేదని మన భూములు తీసుకుని బొగ్గు తీసి అమ్ముకుంటూ వ్యాపారం చేస్తుందన్నారు. 400ఇండ్లు ప్యాకేజీల లేకుండా చేస్తున్నరో వారి కోసం పోరాటం చేయాల్సిందేనని, మట్టి పనికైనా ఇంటోడు కావాలన్న సామెతలాగా నేను మీ కుటుంబసభ్యుడిలా బావించాలని, ముందుండి పోరాటం చేస్తానని ధైర్యం చెప్పారు. ఊరు భూమి తీసుకుంటున్నరు మనకు రావాల్సినవి ఇయ్యాలని కోరుతున్నం మనం ఏవరికి అన్యాయం చేయడం లేదని అన్నారు. చివరి ఇల్లు లేచే వరకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాల్సిందే అనే నిబంధనలు ఉన్నయని, అది జరిగే వరకు ఊరుకునేది లేదని ఆయన తేల్చి చెప్పారు.....

గోదావరి తీరాల్లో మహా హారతి ఉత్సవాలకు శ్రీకారం

ఈ నెల 22 నుంచి డిసెంబర్ 7 వరకు ఏడు ప్రాంతాల్లో కార్యక్రమాలు

జ్యోతి నగర్ ఎన్టిపిసి నవంబర్ 11 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్



: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని గోదావరి హారతి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గోదావరి మాతకు మహా హారతి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు సమితి రాష్ట్ర కార్యదర్శి, బీజేపీ నాయకులు క్యాతం వెంకటరమణ తెలిపారు.కార్తీక బుధవారం సందర్భంగా అంతర్గాం మండలం గోలివాడ గోదావరి తీరంలోని శివాలయాన్ని సందర్శించిన క్యాతం వెంకటరమణ పరమేశ్వరుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా కార్తీక మాసంలో గోదావరి హారతి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గోదావరి మాతకు మహా హారతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది కూడా భక్తి శ్రద్ధలతో ఈ కార్యక్రమాలను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.ఈ నెల 22వ తేదీ బుధవారం గోలివాడ గోదావరి తీరంలోని పరమేశ్వరుని సన్నిధిలో మహా హారతి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అనంతరం 25వ తేదీన గోదావరిఖనిలోని సమ్మక్క--సారలమ్మ జాతర ప్రాంగణంలో, 27వ తేదీన మంథనిలోని గౌతమేశ్వర స్వామి సన్నిధిలో, 30వ తేదీన సుందిల్ల లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే డిసెంబర్ 2వ తేదీన మంచిర్యాలలో, 4వ తేదీన జనగామ త్రిలింగేశ్వర స్వామి సన్నిధిలో, 7వ తేదీన ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో మహా హారతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఆయా ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గోదావరి మాత ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోదావరి హారతి ఉత్సవ సమితి అంతర్గాం మండల నాయకులు కంద లోకనాథం, మాడ ప్రభాకర్ రెడ్డి, గుండెమోని ప్రశాంత్, దారవేణి మహేష్, లగిశెట్టి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ లబ్ధిదారుల ఇళ్లకు మేయర్ భూమిపూజ

జ్యోతి నగర్ ఎన్టిపిసి నవంబర్ 11 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకుంటే త్వరితగతిన బిల్లులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటానని లబ్ధిదారులకు రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి హామీ ఇచ్చారు.బుధవారం 46,36,22 డివిజన్ లలో పలు లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణ పనులకు ఆయన భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఎం ఎల్ ఏ రాజ్ ఠాకూర్ చొరవతో నియోజకవర్గానికి 3500 ఇండ్లు మంజూరయ్యాయని ,ఇంకా ఎవరైనా అర్హులు మిగిలిపోతే వారికి కూడా ఇందిరమ్మ ఇండ్లు ఇప్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక నాయకులు కల్వల రంజిత్ ,కన్నూరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాగింగ్‌కు దూరంగా... డ్రగ్స్‌కు వ్యతిరేకంగా... క్రమశిక్షణ, పరస్పర గౌరవం, సేవాభావంతో ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలి

ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు.. పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝూలి

జ్యోతి నగర్ ఎన్టిపిసి నవంబర్ 11 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

గోదావరిఖనిలోని సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లో యాంటీ ర్యాగింగ్, డ్రగ్స్, గంజాయి వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, మాదకద్రవ్యాల వినియోగం మరియు సరఫరాపై ఉన్న చట్టపరమైన నిబంధనలు, శిక్షలపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించేందుకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ,వైద్య వృత్తి కేవలం ఉద్యోగం లేదా సాధారణ సేవ కాదని, ప్రాణాపాయంలో ఉన్న వారికి ప్రాణదాతలుగా నిలిచే అత్యంత బాధ్యతాయుతమైన, పవిత్రమైన వృత్తి అని అన్నారు. అందుకే ప్రజలు వైద్యులను ప్రత్యక్ష దైవాలుగా భావిస్తారని పేర్కొన్నారు.విద్యార్థులు తమ విద్యాభ్యాస సమయంలోనే క్రమశిక్షణ, మానవతా విలువలు, సేవాభావం, పరస్పర గౌరవం వంటి మంచి లక్షణాలను అలవర్చుకోవాలని సీపీ సూచించారు. వైద్య విద్యను అభ్యసిస్తున్న ప్రతి విద్యార్థి భవిష్యత్తులో మంచి వైద్యుడిగా ఎదగడంతో పాటు మంచి వ్యక్తిగా, బాధ్యతాయుతమైన పౌరుడిగా సమాజానికి సేవలందించాలని ఆకాంక్షించారు.

సీనియర్లు జూనియర్లకు మార్గదర్శకులుగా ఉండాలి

గోదావరిఖని ఏసీపీ ఎం.రమేశ్ మాట్లాడుతూ..., సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు సహాయం చేయాలని,వారికి సరైన మార్గదర్శకత్వం అందిస్తూ ప్రోత్సహించాలి తప్ప ఎట్టి పరిస్థితుల్లోనూ వేధింపులకు గురిచేయరాదని అన్నారు. కళాశాలలో ప్రతి విద్యార్థి ఎలాంటి భయం లేకుండా, సురక్షితమైన వాతావరణంలో విద్యను అభ్యసించేలా అందరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.సీనియర్, జూనియర్ అనే తేడా లేకుండా విద్యార్థులందరూ పరస్పరం గౌరవించుకుంటూ, ఒకరికొకరు సహకరించుకోవాలని, ముఖ్యంగా సీనియర్ విద్యార్థులు జూనియర్ల పట్ల స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ వారికి మార్గదర్శకులుగా నిలవాలని అన్నారు. ప్రపంచంలో దేవుడిని రెండు రూపాల్లో భావిస్తారని, పరలోకంలో ఉండే దేవుడు కనిపించకపోయినా మన కళ్లముందు ప్రత్యక్షంగా కనిపించే దేవుళ్లు వైద్యులని ఏసీపీ పేర్కొన్నారు. దేవుడు ఎల్లప్పుడూ మంచి చేస్తూ ప్రతి ఒక్కరి మేలు కోరుకున్నట్లుగానే, వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు కూడా సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరిస్తూ, మంచి మార్గంలో నడవాలని సూచించారు.

ర్యాగింగ్‌కు పూర్తిగా దూరంగా ఉండాలి

సీపీ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ...., తెల్లని యూనిఫాంలో క్రమశిక్షణతో, హుందాగా కనిపిస్తున్న వైద్య విద్యార్థులను అభినందించారు. ఇందుకు కృషి చేస్తున్న అధ్యాపక బృందాన్ని, కళాశాల యాజమాన్యాన్ని కూడా అభినందించారు.విద్యార్థి దశలో ఏర్పడే మంచి స్నేహాలు, అనుబంధాలు జీవితాంతం గుర్తుండిపోతాయని అన్నారు. అయితే ర్యాగింగ్ పేరుతో జూనియర్ విద్యార్థులను అవమానించడం, భయపెట్టడం, వేధించడం లేదా మానసికంగా ఇబ్బందులకు గురిచేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని స్పష్టం చేశారు. తాను బీహార్ నుంచి తమిళనాడులోని ఎన్ఐటీ తిరుచ్చిలో విద్యనభ్యసించేందుకు వెళ్లిన రోజులను గుర్తుచేసుకున్న సీపీ, అక్కడ యాంటీ ర్యాగింగ్ కమిటీ హెడ్‌గా బాధ్యతలు నిర్వహించిన సమయంలో విద్యార్థులు, అధ్యాపకుల సహకారంతో ర్యాగింగ్‌కు తావులేని సురక్షితమైన విద్యా వాతావరణాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కళాశాలల్లో ర్యాగింగ్‌ను పూర్తిగా నిర్మూలించి ప్రతి విద్యార్థికి గౌరవప్రదమైన, భద్రమైన విద్యా వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది,సీనియర్ విద్యార్థులు, జూనియర్ విద్యార్థులు అందరిపైనా ఉందని సీపీ అన్నారు.

డ్రగ్స్ వ్యసనం యువత భవిష్యత్తుకు తీవ్ర ప్రమాదం

ర్యాగింగ్ కంటే డ్రగ్స్ వ్యసనం యువత భవిష్యత్తుకు మరింత ప్రమాదకరమని సీపీ అంబర్ కిశోర్ ఝా హెచ్చరించారు. ఒక్కసారి మాదకద్రవ్యాలకు బానిసైతే వాటి నుంచి బయటపడటం ఎంతో కష్టమవుతుందని, డ్రగ్స్ వినియోగం వ్యక్తి జీవితాన్నే కాకుండా మొత్తం కుటుంబాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుందని అన్నారు. డీ-అడిక్షన్ సెంటర్లలో చికిత్స పొందుతున్న వారి పరిస్థితులను పరిశీలిస్తే మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలు ఎంత తీవ్రంగా ఉంటాయో అర్థమవుతుందని పేర్కొన్నారు.డ్రగ్స్‌కు దూరంగా ఉండటమే కాకుండా, తమ స్నేహితులు, సహ విద్యార్థులు కూడా మాదకద్రవ్యాలకు బానిస కాకుండా వారిని చైతన్యపరచాలని విద్యార్థులకు సూచించారు. గంజాయి సహా ఇతర మాదకద్రవ్యాల వినియోగం, నిల్వ, రవాణా, విక్రయాలకు సంబంధించి చట్టపరమైన చర్యలు మరియు కఠినమైన శిక్షలు ఉంటాయని తెలిపారు. డ్రగ్స్ వినియోగం వల్ల విద్యార్థుల విద్యాభ్యాసం, ఆరోగ్యం, వ్యక్తిగత జీవితం, కుటుంబ సంబంధాలు, భవిష్యత్ కెరీర్ తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉందని హెచ్చరించారు. కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది యాంటీ డ్రగ్ కమిటీల ద్వారా హాస్టళ్లు, కళాశాల ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాలు, సాధారణ ప్రదేశాలు తదితర ప్రాంతాల్లో తరచూ తనిఖీలు నిర్వహించాలని సీపీ సూచించారు.



రాష్ట్రస్థాయి షార్ట్ ఫిల్మ్ పోటీల్లో తృతీయ స్థానం...

- దర్శకుడు నిప్పొత్తుల నాగరాజును సన్మానించిన సీపీ అంబర్ కిషోర్ ఝా

జ్యోతి నగర్ ఎన్టిపిసి నవంబర్ 11 పెద్దపల్లి జిల్లా అక్షర న్యూస్

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం,పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా తెలంగాణ పోలీస్ శాఖ నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆన్‌లైన్ షార్ట్ ఫిల్మ్ పోటీల్లో రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు,అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్ పర్యవేక్షణలో ఎంపిక చేసి పంపిన 'భరోసా' షార్ట్ ఫిల్మ్ తృతీయ స్థానం సాధించింది.మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం నర్వ గ్రామానికి చెందిన నిప్పొత్తుల నాగరాజు దర్శకత్వంలో రూపొందించిన 'భరోసా' షార్ట్ ఫిల్మ్ రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానం సాధించడం పట్ల రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా,ఐపీఎస్ హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా బుధవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సీపీ అంబర్ కిషోర్ ఝా దర్శకుడు నిప్పొత్తుల నాగరాజును శాలువాతో సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ,ప్రజల రక్షణే ప్రధాన లక్ష్యంగా పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తోందని తెలిపారు.ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలకు పరిష్కారం చూపడంలో పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.ప్రజల్లో పోలీస్ శాఖ పట్ల నమ్మకం, భరోసాను మరింత పెంపొందించే విధంగా షార్ట్ ఫిల్మ్‌లను రూపొందించాలని సీపీ సూచించారు. ముఖ్యంగా సైబర్ నేరాలు,ట్రాఫిక్ నిబంధనలు, గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన, చైతన్యం కలిగించేలా నాణ్యమైన షార్ట్ ఫిల్మ్‌లను ప్రొఫెషనల్ స్థాయిలో రూపొందించాలని తెలిపారు. సృజనాత్మకతతో పాటు సామాజిక బాధ్యతను ప్రతిబింబించే చిత్రాలు సమాజంలో సానుకూల మార్పుకు దోహదపడతాయని సీపీ పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు ఉపయోగపడే సందేశాత్మక చిత్రాలను రూపొందించి పోలీస్ శాఖకు,సమాజానికి మంచి పేరు తీసుకురావాలని దర్శకుడు నాగరాజును అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐబీ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి

మంచిర్యాల జిల్లా/ మందమర్రి నవంబర్ 11/అక్షరం న్యూస్ -:

మందమర్రి పట్టణ మున్సిపాలిటీ పరిధిలో గల సింగరేణి హై స్కూల్ గ్రౌండ్లో బుధవారం మనో వికాస స్కూల్ లో "మౌలానా అబుల్ కలాం ఆజాద్" జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ విద్యా దినోత్సవం మరియు మైనార్టీ సంక్షేమ దినోత్సవంను పురస్కరించుకొని, భారతదేశం మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర సమరయోధుడు, అసలు పేరు మొహినద్దీన్ హైమద్, అబుల్ కలాం అనేది ఆయన బిరుదు, ఆజాద్ ఆయన కలం పేరు, భారతదేశ స్వాతంత్ర సంగ్రామంలో కీలక పాత్ర పోషించాడన్నారు, మహాత్మా గాంధీ ప్రారంభించిన సహాయక నిరాకరణ సంగ్రామం ఉద్యమం, 1920లో జాతీయ కాంగ్రెస్ పార్టీలో చేరినాడన్నారు. ఖిలాఫత్ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం, కిట్టు ఇండియా ఉద్యమంలో పాల్గొని 10 సంవత్సరాలు జైలు పాలైనట్లూ తెలిపారు. స్వాతంత్రం అనంతరము దేశంలో 11 సంవత్సరాలు విద్యామంత్రిగా పని చేసినాడు, హల్ హిలాల పత్రిక రచించాడని, భారతదేశంలో అభివృద్ధి పరచడానికి సహకారాలు అందించాడన్నారు. ఈకార్యక్రమంలో మందమరి ముస్లిం మైనార్టీ నాయకులు ఎం.డి యాకూబ్, ఎం.డి షరీఫ్, ఇమామ్ సాబ్ ముజఫర్ హుస్సేన్, ఎండి నిజాం, ఎం.డి సుకుర్, ఎం,డి జాఫర్, ఎం.డి రహమత్ ఖాన్, ఎం.డి ఇసాక్, ఎం.డి కాజా, స్కూల్ పిల్లలు, పాల్గొన్నారు.



మూడు దశాబ్దాలుగా రామగుండం రుచులకు చిరునామా.. వంటల చంద్రయ్య!

వందలాది మందికి వంటల్లో శిక్షణ.. . పదిమందికి ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న చంద్రయ్య

జ్యోతినగర్, ఎన్టీపీసీ నవంబర్ 11

పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ :

రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఏ శుభకార్యం జరిగినా, ఏ సభా సమావేశం నిర్వహించినా ముందుగా వినిపించే పేరు ఒక్కటే.. అదే వంటల చంద్రయ్య! ఫంక్షన్‌లో వంటల బాధ్యత ఎవరికి అప్పగించాలనే చర్చ వచ్చినప్పుడు అందరి నోటా వచ్చే మాట.. 'ఇంకెందుకు చంద్రయ్య ఉన్నాడు కదా!' అనేదే. గత మూడు దశాబ్దాలుగా ఈ ప్రాంత ప్రజల నమ్మకాన్ని సంపాదించుకున్న చంద్రయ్య.. రుచికరమైన వంటకాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయనకు వంటల బాధ్యత అప్పగిస్తే ఇక ఎలాంటి ఆందోళన అవసరం లేదనే విశ్వాసాన్ని సంపాదించుకున్నారు. ఇంటికి వచ్చి వంట చేయాలన్నా, వేలాది మందికి విందు ఏర్పాటు చేయాలన్నా సమయానికి, నాణ్యతతో వంటకాలు అందించడం ఆయన ప్రత్యేకత. అందరితో వినయ విధేయతలతో ఉండే చంద్రయ్య కష్టపడే స్వభావం ఆయనను పైకి తీసుకొచ్చింది. అధికారులు సామాన్య ప్రజలు అందరితో అనుకువగా ఉండే మంచితనం ఆయనను మరింత ముందుకు తీసుకు పోయింది.ఒకప్పుడు 80 మందికి వంట చేయడంతో ప్రారంభమైన ఆయన ప్రయాణం నేడు మూడు వేల మందికి పైగా భోజనాలు సిద్ధం చేసే స్థాయికి చేరింది. మటన్, చికెన్, చేపలు, రొయ్యలతో పాటు శాఖాహారంలో అన్ని రకాల కూరలు, పప్పులు, సాంబార్లు, స్వీట్లు.. ఇలా ఏ వంటకమైనా తనదైన రుచితో తయారు చేయడంలో ఆయనది అందవేసిన చేయి. ముఖ్యంగా బగారా అన్నం, మటన్ వంటకాలకు ఆయన ప్రత్యేక గుర్తింపు ఉంది. ఫంక్షన్లలో బగారా అన్నం, మటన్ తింటున్నప్పుడు 'ఈ వంట చంద్రయ్యదేనా?' అని ఆరా తీసేంతగా ఆయన వంటకాలు ప్రజాదరణ పొందాయి.

ఒక గురువు దగ్గర నేర్చుకుని.. వేల మందికి నేర్పించిన వంట మనిషి

1990లో రామగుండం ప్రాంతానికి వచ్చిన చంద్రయ్య, పొట్టేలకు చెందిన కట్ట భూమయ్య అనే వంట మాస్టర్ దగ్గర వంటలు నేర్చుకున్నారు. ఆయన వద్ద శిక్షణ పొందిన అనంతరం తొలుత ఇళ్లలో చిన్నచిన్న కార్యక్రమాలకు వంటలు చేయడం ప్రారంభించారు. ఇద్దరు సహాయకులతో మొదలైన ఈ ప్రయాణం క్రమంగా విస్తరించింది. తనకున్న అనుభవాన్ని, వంటల్లోని మెళకువలను ఇతరులకు నేర్పిస్తూ వందలాది మందిని వంట మనుషులుగా తీర్చిదిద్దారు. నేడు వారిలో చాలామంది రెస్టారెంట్లు, రిసార్టులు, హోటళ్లలో ప్రధాన వంట మాస్టర్లుగా స్థిరపడటం ఆయన శిక్షణకు నిదర్శనం. 1996 తర్వాత రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఫంక్షన్ హాళ్ల సంఖ్య పెరగడం, పెళ్లిళ్లు, శుభకార్యాలు, రాజకీయ పార్టీల సభలు, బహిరంగ సమావేశాలు, క్రీడా కార్యక్రమాలు విస్తరించడంతో వంటలకు డిమాండ్ గణనీయంగా పెరిగింది. దీంతో చంద్రయ్యకు వరుసగా ఆర్డర్లు వచ్చేవి. ఒకేసారి నాలుగైదు ఫంక్షన్ల బాధ్యతలు స్వీకరించడమే కాకుండా, కొన్ని సందర్భాల్లో ఏకంగా 15 కార్యక్రమాలకు వంటలు చేసిన రోజులు కూడా ఉన్నాయని ఆయన గుర్తు చేసుకున్నారు. అలాంటి సమయంలో తాను స్వయంగా అన్ని ప్రాంతాలను పర్యవేక్షిస్తూ, తన వద్ద శిక్షణ పొందినవారికి బాధ్యతలు అప్పగించి కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసేవారు. సభలు, సమావేశాలు, సదస్సులు, శిక్షణా శిబిరాలు.. ఇలా ఏ కార్యక్రమం జరిగినా అక్కడ చంద్రయ్య బృందం ఉండాల్సిందే అన్న స్థాయికి ఎదిగారు.

పుష్కరాల నుంచి ముఖ్యమంత్రుల సభల వరకు..

గోదావరి నదికి నిర్వహించిన రెండు పుష్కరాల సందర్భంగా వేలాది మందికి వంటలు సిద్ధం చేయడంలో చంద్రయ్య కీలక పాత్ర పోషించారు. ఆ సమయంలో పోలీసు శాఖకు పెద్ద ఎత్తున ఆహార ఏర్పాట్లు చేసి అందరి ప్రశంసలు అందుకున్నారు. అప్పటి పోలీసు ఉన్నతాధికారి అనురాగ్ శర్మ ఆయన సేవలను అభినందించగా, అప్పటి డీఎస్పీ చౌహాన్ కూడా ఎంతో ప్రోత్సహించారని చంద్రయ్య గుర్తు చేసుకున్నారు. సమ్మక్క జాతరలు, ముఖ్యమంత్రుల పర్యటనలు, భారీ బహిరంగ సభల సమయంలో విధుల్లో





ఉండే పోలీసు సిబ్బందికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం సమయానికి అందించేవారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి, చంద్రబాబు నాయుడు, కేసీఆర్ వంటి ముఖ్యమంత్రుల సభల్లోనూ వంటల బాధ్యతలు నిర్వహించిన అనుభవం ఆయనకు ఉంది. బీజేపీ ప్లీనరీ కార్యక్రమానికి కూడా వంటలు సిద్ధం చేయగా, ఆ రోజు సినీ నటుడు కృష్ణంరాజు సైతం భోజనం రుచి చూసి అభినందించినట్లు గుర్తు చేస్తున్నారు. రాజకీయ, సామాజిక, అధికారిక కార్యక్రమాల్లో తన వంటలతో ప్రత్యేక ముద్ర వేసుకున్నారు.

ఎన్నికల వేళ వేలాది మందికి ఆహార ఏర్పాట్లు

ఎన్నికల సమయంలోనూ చంద్రయ్య సేవలకు విశేష గుర్తింపు లభించింది. పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే సిబ్బందికి, ఎన్నికల పనుల్లో పాల్గొనే వారికి ఆహార పొట్లాలు అందించే ఏర్పాట్లు చేశారు. మాతంగి నరసయ్య నుంచి మాలె మల్లేశం, సోమారపు సత్యనారాయణ, కోరుకంటి చందర్, కొప్పుల ఈశ్వర్ వరకు పలువురు ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, మంత్రుల కార్యక్రమాలకు భోజన ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. రాజకీయ పార్టీలకు అతీతంగా తన వంటల సేవలను అందిస్తూ అందరి ఆదరణ పొందారు.

ఎన్టీపీసీ, సింగరేణి, జెన ట్రాన్స్కో ఉద్యోగుల ప్రోత్సాహం..

ఎన్టీపీసీ ఉద్యోగులు నిర్వహించే వివిధ శుభకార్యాలు, వ్యక్తిగత కార్యక్రమాలు చంద్రయ్య ఎదుగుదలకు ఎంతో తోడ్పడ్డాయి. ఇక్కడి ఉద్యోగులు ఇతర జిల్లాల్లో తమ కుటుంబ కార్యక్రమాలు నిర్వహించినప్పుడు సైతం రామగుండం నుంచి చంద్రయ్యను ప్రత్యేకంగా తీసుకెళ్లి వంటలు చేయించుకునేవారు. తనను ప్రోత్సహించిన వారిలో కాసిపేట లింగయ్య, జీవన్‌రావులను ఎప్పటికీ మరచిపోలేనని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా సింగరేణి అధికారుల నుంచి కూడా తనకు ఎంతో ప్రోత్సాహం లభించిందని తెలిపారు. అప్పటి జీఎం మనోహర్‌రావు తన వంటలను అభినందించేవారని, అప్పటి నుంచి సింగరేణిలో జరిగే ప్రతి ఫంక్షన్, క్లబ్ సమావేశానికి అల్పాహారం నుంచి భోజనాల వరకు తమ బృందం సరఫరా చేస్తోందని వివరించారు.

క్యాటరింగ్ ద్వారా వందల మందికి ఉపాధి..

క్యాటరింగ్ సంస్కృతి విస్తరించిన తర్వాత చంద్రయ్య తన పనితీరును మరింత విస్తరించారు. దాదాపు వంద మందిని ఒక బృందంగా ఏర్పాటు చేసుకుని వివిధ కార్యక్రమాలకు క్యాటరింగ్ సేవలు అందించారు. వారికి ప్రత్యేకంగా యూనిఫాంలు కుట్టించి ఇచ్చి క్రమశిక్షణతో పనిచేసేలా తీర్చిదిద్దారు. ఆయన వద్ద పనిచేసి వంటలు, క్యాటరింగ్ పనుల్లో అనుభవం సంపాదించిన వారిలో పలువురు తర్వాత ఎస్సైలు, కానిస్టేబుళ్లు, ఉపాధ్యాయులుగా స్థిరపడటం విశేషం. వంట నేర్పించడమే కాకుండా, యువతకు ఉపాధి మార్గం చూపించడం ద్వారా తన వృత్తిని ఒక సామాజిక బాధ్యతగా మలుచుకున్నారు.

మూడు రాష్ట్రాలకు విస్తరించిన రుచుల ప్రయాణం

రామగుండంతో ప్రారంభమైన చంద్రయ్య వంటల ప్రయాణం నేడు తెలంగాణకే పరిమితం కాలేదు. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు తదితర ప్రాంతాలకు విస్తరించింది. ఆయా ప్రాంతాలకు వెళ్లి పెద్దపెద్ద కార్యక్రమాలకు వంటలు సిద్ధం చేశారు. రామగుండంలో చంద్రయ్య ఇంటి చిరునామా తెలియని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. ఇప్పటికీ ఆయన ఇంటి వద్ద రోజూ వంటల ఆర్డర్లు కొనసాగుతూనే ఉన్నాయి. రోజుకు సుమారు 100 నుంచి 200 మందికి సరిపడా భోజనాలు, అల్పాహారాలు సిద్ధం చేస్తున్నారు. ఫలితంగా ప్రతిరోజూ 10 నుంచి 20 మందికి ఉపాధి కల్పిస్తున్నారు. ఇంటివద్ద జరిగే చిన్న శుభకార్యాల నుంచి పెద్ద ఫంక్షన్ల వరకు ఫోన్ ద్వారానే ఆర్డర్లు స్వీకరించి, నిర్దిష్ట సమయానికి ఆహారాన్ని అందించేందుకు సిద్ధంగా ఉంటున్నారు. తక్కువ ధరలోనే బిర్యానీ, మటన్, చికెన్, రైస్, బగారా అన్నం, జీరా రైస్, వివిధ రకాల స్వీట్లు తయారు చేసి అందిస్తున్నారు. పుట్టినరోజులు, సారె కార్యక్రమాలు, కర్ణవేదం, గృహప్రవేశాలు, పురుడు వంటి కుటుంబ వేడుకల్లోనూ ఆయన వంటలకు ప్రత్యేక ఆదరణ ఉంది.

వంట వృత్తి నుంచి ఒక వ్యవస్థ నిర్మాణం వరకు..

మూడు దశాబ్దాలుగా అవిశ్రాంతంగా శ్రమిస్తూ చంద్రయ్య కేవలం వంట మనిషిగా మాత్రమే కాకుండా, ఒక పెద్ద ఉపాధి వ్యవస్థను నిర్మించారు. తన దగ్గర పనిచేసిన వారికి వృత్తి నైపుణ్యాన్ని అందించి, స్వతంత్రంగా ఎదిగే అవకాశాన్ని కల్పించారు. ఒకప్పుడు ఇద్దరు సహాయకులతో ప్రారంభమైన ఆయన ప్రయాణం నేడు అనేక కుటుంబాలకు ఉపాధి కల్పించే స్థాయికి చేరింది. తన ఎదుగుదలలో తోడ్పడిన ఎన్టీపీసీ, సింగరేణి ఉద్యోగులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, రామగుండం ప్రాంత ప్రజల ఆదరణే తన విజయానికి కారణమని చంద్రయ్య చెబుతున్నారు. రామగుండంలో జన్కో క్వార్టర్లో ఉండే చంద్రయ్య అందరికీ అభిమాన పాత్రుడుగా నిలిచాడు.ప్రస్తుతం ఎదిగిన తన కుమారుడు నిఖిల్ కూడా వ్యాపార నిర్వహణలో సహకరిస్తుండటంతో తదుపరి తరం వైపు తన వంటల సేవలను విస్తరించే దిశగా అడుగులు వేస్తున్నారు. ఒక గురువు దగ్గర వంట నేర్చుకుని, ఆ విద్యతో తన జీవితాన్ని తీర్చిదిద్దుకోవడమే కాకుండా వందలాది మందికి ఆ విద్యను పంచి, వేలాది మందికి ఉపాధి కల్పించిన చంద్రయ్య ప్రయాణం నిజంగా స్ఫూర్తిదాయకం. వంటలో రుచి, పనిలో నిబద్ధత, మాటలో నమ్మకం, సేవలో అంకితభావం ఉంటే ఒక సాధారణ వృత్తి కూడా ఎంతటి గుర్తింపును, గౌరవాన్ని తెచ్చిపెడుతుందో ఆయన జీవితం చాటిచెబుతోంది. అందుకే రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఏ ఫంక్షన్ జరిగినా ముందుగా గుర్తుకొచ్చే పేరు.. వంటల చంద్రయ్య!

గోదావరిఖని లాడ్జిలో పేకాట సావరంపై పోలీసుల దాడి

10 మంది అరెస్ట్.. రూ.1.36 లక్షల నగదు, 10 సెల్‌ఫోన్లు స్వాధీనం

జ్యోతినగర్, ఎన్టీపీసీ నవంబర్ 11 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

: గోదావరిఖని పట్టణంలోని లాడ్జిలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్, వన్‌టౌన్ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి పేకాట ఆడుతున్న పది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1,36,130 నగదు, 10 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఐబీ కాలనీలో ఉన్న వినాయక్ రెసిడెన్సీ లాడ్జిలో డబ్బులు పందెంగా పెట్టి మూడు ముక్కలాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం అర్ధరాత్రి టాస్క్‌ఫోర్స్, నార్కోటిక్ ఏసీపీ శ్రీనివాసరావు నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్, గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు సంయుక్తంగా దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న పది మందిని పట్టుకున్నారు.పట్టుబడిన వారిలో ఎస్ఎం ఖాన్ (ఎన్టీపీసీ సండే మార్కెట్), టి.నర్సింగరావు (జంగాం), పి.తిరుపతి (పవర్‌హౌస్ కాలనీ), ఎం.కుమార్ (ప్రగతినగర్), కె.కిరణ్ (రామగుండం), వి.సతీష్ (బాపూజీనగర్), ప్రవీణ్ (గౌతమీనగర్), ఆర్.మణి (మార్కండేయ కాలనీ), ఎస్‌కె భాషి (మార్కండేయ కాలనీ), కె.రాజ్‌కుమార్ (తిలక్‌నగర్) ఉన్నారు. పట్టుబడిన వారిని, స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా పేకాట, జూదం నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.



రైతులకు అండగా ప్రజా ప్రభుత్వం

- దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి...

- కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షులు పోచంపల్లి రాజిరెడ్డి...

హనుమకొండ జిల్లా/ భీమదేవరపల్లి/ నవంబర్ 11/ అక్షరం న్యూస్:-

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని, దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోచంపల్లి రాజిరెడ్డి సూచించారు.తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామంలో రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎల్కతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్‌పర్సన్ బొక్కల శ్రవంతితో కలిసి పోచంపల్లి రాజిరెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా పోచంపల్లి రాజిరెడ్డి మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని దళారులకు తక్కువ ధరకు విక్రయించి నష్టపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా జరగాలని తూకం ధాన్యం నమోదు ఇతర ప్రక్రియల్లో జాప్యం లేకుండా సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రైతుల కష్టానికి తగిన ప్రతిఫలం అందించేందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. రైతులకు అండగా నిలవడమే ప్రభుత్వ ధ్యేయమని మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించుకునే అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తకొండ, చంటయ్యపల్లి గ్రామాల సర్పంచులు, మల్లారం క్లస్టర్ మౌనిక, కాంగ్రెస్ పార్టీ నాయకులు,సీసీ వేణు, కార్యకర్తలు, ఐకేపీ సిబ్బంది, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు వ్యాసరచన పోటీలు

- జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్యక్రమం



కరీంనగర్/ఇల్లందకుంట,/ నవంబర్ 11/ అక్షరం న్యూస్ :

జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని హుజురాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఇల్లందకుంట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'విద్య యొక్క ప్రాముఖ్యత' అనే అంశంపై నిర్వహించిన ఈ పోటీల్లో మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మండల విద్యాధికారి కె. రాములు నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తస్లీమ్ నజ్నీమ్ మాట్లాడుతూ విద్యే నిజమైన బలమని, జ్ఞానార్జన ద్వారానే దేశ పురోగతికి, సమాజ అభివృద్ధికి తోడ్పడవచ్చని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవడంతో పాటు పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. విద్య ప్రాముఖ్యతను వివరించిన ఉపాధ్యాయులు, విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించేలా మండల స్థాయిలో పోటీలు నిర్వహించిన ట్రస్ట్ నిర్వాహకులను అభినందించారు.ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ గంగిశెట్టి జగదీశ్వర్ (రిటైర్డ్ ఉపాధ్యాయుడు) మాట్లాడుతూ 2011 సంవత్సరం నుంచి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు, సమాజంలోని పేదలకు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ నాయకుల జయంతి, వర్ధంతి సందర్భాల్లో వ్యాసరచన, క్రీడా పోటీలు నిర్వహిస్తూ వారి ఆశయాలను నేటి విద్యార్థులకు పరిచయం చేసి, వారిలో స్ఫూర్తి నింపేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు.అనంతరం వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మండల స్థాయిలో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇల్లందకుంట విద్యార్థిని ఎం. రచన, కేజీబీవీ ఇల్లందకుంట విద్యార్థిని పి. నాగలక్ష్మికి శంకర్ నారాయణ నిఘంటువులతో పాటు షీల్డులను అందజేశారు. కన్సోలేషన్ బహుమతులుగా బి. రక్షిత, ఎం. అక్షయ్, ఎం. సహస్ర, కె. రితిక్, డి. కావ్యశ్రీ, బి. నితిన్, ఎం. అక్షయ్, డి. రితికలకు శంకర్ నారాయణ నిఘంటువులను అందించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్. అనసూయ, ప్రేమ్ రాజు, కె. జయప్రకాష్, సీహెచ్. వేణు, కె. సత్యం, జె. రాధికారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

మాధన్ హిప్పర్గాలో మహిళా సంఘ భవన నిర్మాణానికి మార్కెట్

- ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు ఆదేశాలతో రూ.10 లక్షల నిధులతో భవన నిర్మాణానికి శ్రీకారం



మద్నూర్ / నవంబర్ 11 (అక్షరం న్యూస్ -- కామారెడ్డి):

డోంగ్లీ మండలంలోని మాధన్ హిప్పర్గ గ్రామంలో మహిళా సంఘాల బలోపేతానికి మరో ముందడుగు పడింది. జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మీకాంతరావు ఆదేశాల మేరకు గ్రామంలో మహిళా సంఘ భవన నిర్మాణం కోసం బుధవారం మార్కెట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక సర్పంచ్ లక్ష్మణ్ బాచవార్ ఆధ్వర్యంలో గ్రామంలో భవనం నిర్మించనున్న స్థలాన్ని గుర్తించి మార్కెట్ వేశారు.

రూ.10 లక్షలతో మహిళా సంఘ భవన నిర్మాణం

గ్రామంలోని మహిళా సంఘాల సభ్యులకు సమావేశాలు నిర్వహించుకోవడానికి, స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలను కొనసాగించడానికి ప్రత్యేక భవనం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్థానిక నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు చొరవతో రూ.10 లక్షల నిధులతో మహిళా సంఘ భవనాన్ని నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఈ భవనం అందుబాటులోకి వస్తే గ్రామంలోని మహిళా సంఘాల సభ్యులకు సమావేశాలు, సంఘ కార్యకలాపాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు.

మహిళా సంఘాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం సహకారం

గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో మహిళా సంఘాలకు కాంగ్రెస్ ప్రభుత్వం వివిధ రూపాల్లో సహకారం అందిస్తోందని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని ఆర్థిక స్వావలంబన సాధించేందుకు మహిళా సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో మహిళా సంఘాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

మార్కెట్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లక్ష్మణ్ బాచవార్, ఉపసర్పంచ్ నరుబాయి, మహిళా సంఘం అధ్యక్షురాలు శారద మధుకర్, సంఘం ఉపాధ్యక్షురాలు, మహిళా సంఘాల సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉమాకాంత్ పటేల్, పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామ పంచాయతీ కార్యదర్శి పవన్, పీఆర్ ఇంజనీర్ దేవిదాస్ తదితరులు పాల్గొన్నారు.మహిళా సంఘ భవన నిర్మాణానికి మార్కెట్ వేయడంతో గ్రామ మహిళల్లో హర్షం వ్యక్తమవుతోంది. భవన నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయాలని గ్రామస్తులు ఆకాంక్షిస్తున్నారు.

కార్మికులకు పెద్దపీట.. సమానత్వానికి నిదర్శనంగా సర్పంచ్ ఉష సంతోష్ మేస్త్రి లక్ష్మీ పూజలు!

- లక్ష్మీ పూజ అనంతరం ముందుగా పంచాయతీ కార్మికులకు దీపావళి శుభాకాంక్షలు.. వారితో కలిసి విందు భోజనం

మద్నూర్ /నవంబర్ 11(అక్షరం న్యూస్ -- కామారెడ్డి:)

పండుగ అంటే కేవలం కుటుంబ సభ్యులతోనే కాకుండా మనతో కలిసి పనిచేసే ప్రతి ఒక్కరితో ఆనందాన్ని పంచుకోవడమే నిజమైన పండుగ సంబరమని చాటిచెప్పారు మద్నూర్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ ఉష సంతోష్ మేస్త్రి. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆమె నిర్వహించిన లక్ష్మీ పూజా కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

కార్మికులకే తొలి ప్రాధాన్యం.. సర్పంచ్ ప్రత్యేక ఆత్మీయత

లక్ష్మీ పూజ కార్యక్రమం పూర్తయిన వెంటనే సర్పంచ్ ఉష సంతోష్ మేస్త్రి ముందుగా తన గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులను కలిసి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకొని, వారితో ఆత్మీయంగా ముచ్చటించారు. సర్పంచ్ ఇంట్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక విందు భోజనంలో ముందుగా కార్మికులకు అన్నదానం నిర్వహించారు.ఆ తర్వాత బంధుమిత్రులు, గ్రామస్థులకు విందు భోజనం ఏర్పాటు చేసి అందరితో కలిసి పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. హోదాలు, స్థాయిలకు అతీతంగా ప్రతి ఒక్కరినీ సమానంగా గౌరవించాలనే సందేశాన్ని తన ఆచరణ ద్వారా చాటిచెప్పారు.



గ్రామ పరిశుభ్రతలో కార్మికుల పాత్ర ఎంతో కీలకం

ఈ సందర్భంగా సర్పంచ్ ఉష సంతోష్ మేస్త్రి మాట్లాడుతూ.. మద్నూర్ మేజర్ గ్రామ పంచాయతీని పరిశుభ్రంగా, సుందరంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికులు, పంచాయతీ సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రతిరోజూ ఎండ, వానలను లెక్కచేయకుండా గ్రామ పరిశుభ్రత కోసం శ్రమిస్తున్న కార్మికుల సేవలను గుర్తించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.గ్రామ అభివృద్ధి అనేది ఒక్కరి వల్ల సాధ్యమయ్యేది కాదని, ప్రజా ప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది, కార్మికులు, గ్రామస్థులు సమిష్టిగా పనిచేసినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. కార్మికులకు తగిన గౌరవం, ఆత్మీయత ఇవ్వడం ద్వారా వారిలో మరింత ఉత్సాహం పెరుగుతుందని పేర్కొన్నారు.

సర్పంచ్ ఆత్మీయతపై గ్రామస్థుల హర్షం

పండుగ వేళ ముందుగా కార్మికులను గుర్తించి, వారికి ప్రాధాన్యతనిస్తూ శుభాకాంక్షలు తెలియజేయడం, వారితో కలిసి భోజనం చేయడం అక్కడికి వచ్చిన బంధుమిత్రులు, గ్రామస్థులను ఆకట్టుకుంది. కార్మికుల పట్ల సర్పంచ్ చూపిన ఆప్యాయత, గౌరవం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.ప్రజాప్రతినిధులుగా బాధ్యతలు నిర్వహించడంతో పాటు సమాజంలోని ప్రతి వర్గానికి సమాన గౌరవం ఇవ్వడం ద్వారా ప్రజలకు మరింత దగ్గరవచ్చని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. పండుగ సంబరాల్లో కార్మికులను భాగస్వాములను చేస్తూ సర్పంచ్ ఉష సంతోష్ మేస్త్రి చూపిన ఆత్మీయత మద్నూర్‌లో ప్రత్యేకంగా చర్చనీయాంశమైంది.కార్మికుల సేవలను గుర్తిస్తూ, అందరితో కలిసి పండుగ ఆనందాన్ని పంచుకున్న ఈ లక్ష్మీ పూజా కార్యక్రమం సమానత్వం, మానవత్వం, ఆత్మీయతకు ప్రతీకగా నిలిచింది. అక్షరం దిన పత్రిక

మద్నూర్ ప్రభాత్ ఫేరి లో భక్తి నీ చాటుకుంటున్న శూనకం (కుక్క)

- మంగళహారులతో స్వాగతం పలుకుతున్న ప్రజలు.
- శూనకం కు కూడా పూజలు నిర్వహిస్తున్న జనాలు.
- తెల్లవారుజామున 4 గంటలకే భక్తులతో కలిసి గ్రామ వీధుల్లోకి అడుగులు..
- ప్రతి వాడకు, ప్రతి ఇంటికి ఆధ్యాత్మిక సందేశం
- భక్తుల బృందాన్ని విడిచిపెట్టకుండా ప్రతిరోజూ వారితోనే ప్రయాణం..
- గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా మారిన మూగజీవి!

మద్నూర్ / నవంబర్ 11 (అక్షరం న్యూస్ -- కామారెడ్డి):

భక్తి మార్గంలో మనుషులకే కాదు.. మూగజీవులకు సైతం ఓ ప్రత్యేక అనుబంధం ఉంటుందని చాటిచెబుతున్న ఆసక్తికర దృశ్యం మద్నూర్ మండల కేంద్రంలో కనిపిస్తోంది. ప్రతిరోజూ తెల్లవారుజామున నిర్వహిస్తున్న ప్రభాత ఫేరిలో మహారాజ్ సంగయప్ప, శంకరప్పా, భక్తులతో పాటు ఓ శునకం కూడా క్రమం తప్పకుండా పాల్గొంటూ గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. భక్తుల వెంట అడుగులు వేస్తూ, వారి బృందాన్ని విడిచిపెట్టకుండా గ్రామ వీధుల్లో తిరుగుతున్న ఈ శునకం ఇప్పుడు ప్రభాత ఫేరిలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

ఉదయం 4 గంటల నుంచే ఆధ్యాత్మిక సందడి

ప్రతిరోజూ తెల్లవారుజామున 4 గంటలకే భక్తులు నిద్రలేచి భజనలు, భక్తి గీతాలు, దైవ నామస్మరణతో ప్రభాత ఫేరిని ప్రారంభిస్తున్నారు. గ్రామంలోని అన్ని వాడలు, వీధులు తిరుగుతూ ప్రతి ఇంటి వద్దకు చేరుకుని ప్రజలను ఆధ్యాత్మిక చింతన వైపు మేల్కొలుపుతున్నారు. భక్తి, క్రమశిక్షణ, ఐక్యత, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం.



భక్తుల వెంట శునకం.. చూపరులకు కనువిందు!

ఈ ప్రభాత ఫేరిలో అందరినీ ఆశ్చర్యపరుస్తున్న అంశం ఏమిటంటే.. భక్తులు ఎక్కడికి వెళ్తే అక్కడికి ఈ శునకం కూడా వారిని అనుసరిస్తోంది. భక్తుల బృందంతో కలిసి వీధుల్లో నడుస్తూ, వారి వెంటనే ప్రతి వాడకు చేరుకుంటోంది. ప్రతిరోజూ తెల్లవారుజామున ఇదే విధంగా భక్తులతో కలిసి కనిపించడం గ్రామస్తుల్లో ఆసక్తిని కలిగిస్తోంది. సాధారణంగా మూగజీవులను పట్టించుకోని పరిస్థితుల్లో, భక్తుల వెంట నడుస్తున్న ఈ శునకం అందరి చూపును తనవైపు తిప్పుకుంటోంది.

మూగజీవుల పట్ల ప్రేమకు నిదర్శనం

మనుషులకు, మూగజీవులకు మధ్య ఏర్పడే అనుబంధం ఎంత సహజమైనదో ఈ దృశ్యం తెలియజేస్తోంది. మాటలు మాట్లాడలేని మూగజీవులు సైతం ప్రేమను, ఆప్యాయతను తమ ప్రవర్తన ద్వారా వ్యక్తపరుస్తాయని ఈ సంఘటన గుర్తుచేస్తోంది. భక్తుల నిత్య కార్యక్రమంలో ఈ శునకం కూడా భాగమైనట్లుగా కనిపించడం విశేషం.ఒకవైపు భక్తుల నామస్మరణతో గ్రామ వీధుల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుండగా, మరోవైపు వారి వెంట నడుస్తున్న శునకం ప్రభాత ఫేరికి మరింత ప్రత్యేకతను తీసుకొస్తోంది. భక్తి మార్గంలో ఐక్యత, ప్రేమ, జీవకారుణ్యం వంటి విలువలను గుర్తుచేస్తున్న ఈ దృశ్యం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.మొత్తానికి.. ప్రభాత ఫేరిలో భక్తుల అడుగులకు తోడుగా శునకం అడుగులు.. గ్రామంలో ఆధ్యాత్మికతతో పాటు మానవత్వం, మూగజీవుల పట్ల ప్రేమను చాటుతున్న అరుదైన దృశ్యంగా నిలుస్తోంది!

మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి.. విద్యార్థులకు ఏకరూప దుస్తులు, షూల పంపిణీ

- విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను
- అధిరోహించాలి: జిల్లా కాంగ్రెస్ మైనారిటీ అధ్యక్షుడు అజీమ్ లాలా

మద్నూర్ / నవంబర్ 11 (అక్షరం న్యూస్ -- కామారెడ్డి):

భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, గొప్ప విద్యావేత్త మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి, జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని బిచ్కుంద కేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు (యూనిఫామ్), షూలను పంపిణీ చేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ అధ్యక్షుడు అజీమ్ లాలా ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు దుస్తులు, షూలను అందజేశారు.

మౌలానా ఆజాద్ ఆశయాలను విద్యార్థులకు వివరించిన అజీమ్ లాలా

ఈ సందర్భంగా అజీమ్ లాలా మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి చేసిన సేవలను, ముఖ్యంగా విద్యారంగ అభివృద్ధికి ఆయన అందించిన కృషిని విద్యార్థులకు వివరించారు. విద్య అనేది ప్రతి ఒక్కరి జీవితంలో అత్యంత ముఖ్యమైన ఆయుధమని, సమాజ అభివృద్ధికి విద్యే పునాది అని పేర్కొన్నారు.

మౌలానా ఆజాద్ విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని, ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య అందుబాటులో ఉండాలని ఆకాంక్షించారని తెలిపారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు క్రమశిక్షణతో, పట్టుదలతో చదువుకోవాలని సూచించారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి మంచి మార్కులు సాధించడంతో పాటు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని అజీమ్ లాలా సూచించారు. పేదరికం, ఆర్థిక ఇబ్బందులు, ఇతర సమస్యలు విద్యకు అడ్డంకులు కాకూడదని, కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆశయాలను నెరవేర్చేలా విద్యార్థులు మంచి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.విద్యార్థులకు ఏకరూప దుస్తులు, షూల పంపిణీ చేయడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించడంతో పాటు విద్య పట్ల మరింత ఆసక్తి కలిగించే ప్రయత్నం చేసినట్లు తెలిపారు.



కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులుఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ అధ్యక్షుడు అజీమ్ లాలా, కో-ఆప్షన్ సభ్యుడు అసద్ అలీ, కౌన్సిలర్ ముజాహిద్, కో-ఆప్షన్ సభ్యుడు సాయిలు, గురుకుల ప్రిన్సిపాల్ సాయిలు, ఉపాధ్యాయ బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా విద్యార్థులకు విద్యా ప్రాధాన్యతను తెలియజేస్తూ, అవసరమైన దుస్తులు, షూలను పంపిణీ చేయడం పట్ల పాఠశాల వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.

ఖమ్మంపాడులో మైనర్ బాలిక అదృశ్యం

- బంధువుల ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి తిరిగి రాని బాలిక
- పెద్దమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు.. దర్యాప్తు చేపట్టిన అశ్వారావుపేట పోలీసులు



భద్రాద్రి కొత్తగూడెం / అశ్వారావుపేట / నవంబర్ 11 / అక్షరం న్యూస్ :అశ్వారావుపేట మండలం ఖమ్మంపాడు గ్రామంలో మైనర్ బాలిక అదృశ్యమైన ఘటన కలకలం రేపింది. తల్లి పదేళ్ల క్రితం మృతి చెందగా, తండ్రి పట్టించుకోకపోవడంతో బాలికను ఆమె పెద్దమ్మ చిచ్చోడి చంద్రమ్మ పెంచుకుంటోంది. ఈ క్రమంలో నవంబర్ 6వ తేదీ రాత్రి బాలిక ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

బంధువుల ఇంటికి వెళ్తానని చెప్పి..

నవంబర్ 6వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో తన పెద్దమ్మ కుమారుడైన కోనే సీతారామయ్య ఇంటికి వెళ్లి వస్తానని పెద్దమ్మకు చెప్పి బాలిక ఇంటి నుంచి వెళ్లింది. అయితే ఎంతసేపటికీ తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం ప్రయత్నించారు.

పోలీసులకు ఫిర్యాదు..

బాలిక ఆచూకీ లభించకపోవడంతో పెద్దమ్మ చిచ్చోడి చంద్రమ్మ అశ్వారావుపేట పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్సై బి. సాయి కిషోర్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బాలిక ఆచూకీ కోసం పోలీసులు చర్యలు చేపట్టారు.

బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తున్న వైన్ షాపులపై చర్యలు తీసుకోవాలి

- లైసెన్సులు రద్దు చేయాలి.. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతాం: పీడీఎస్‌యూ రాష్ట్ర కోశాధికారి అంగిడి కుమార్



కరీంనగర్/జమ్మికుంట/, నవంబర్ 11/ అక్షరం న్యూస్:

జమ్మికుంట, ఇల్లందకుంట మండలాల పరిధిలోని వైన్ షాపుల నుంచి బెల్ట్ షాపులకు విచ్చలవిడిగా మద్యం సరఫరా చేస్తున్న యాజమాన్యాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ అనుబంధ పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర కోశాధికారి అంగిడి కుమార్ డిమాండ్ చేశారు.బుధవారం జమ్మికుంట ఎక్సైజ్ కార్యాలయంలో పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగిడి కుమార్ మాట్లాడుతూ జమ్మికుంట పట్టణం, మండలంతో పాటు ఇల్లందకుంట మండల పరిధిలోని పలు వైన్ షాపుల నుంచి బెల్ట్ షాపులకు నిబంధనలకు విరుద్ధంగా మద్యం సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. అనుమతించిన పరిమితులను మించి పర్మిట్ రూములను బార్లను తలపించేలా నిర్వహిస్తున్నారని విమర్శించారు.అంతేకాకుండా వైన్ షాపుల లైసెన్సులు ఒకరి పేరుతో ఉండగా, వాటిని మరొకరు అంతర్గతంగా నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారాలపై ఎక్సైజ్ అధికారులు సమగ్ర విచారణ జరిపి నిబంధనలు ఉల్లంఘిస్తున్న వైన్ షాపుల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తున్నట్లు తేలిన షాపుల లైసెన్సులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి లోకి, జిల్లా ఉపాధ్యక్షుడు వెల్ది రాజు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ కుటుంబాన్ని పరామర్శించిన కందుల సంధ్యారాణి పోశం



రామగిరి (పెద్దపెల్లి జిల్లా) నవంబర్ 11 అక్షరం న్యూస్:

రామగిరి మండలం రామాయపల్లె (బుధవారం పేట) గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ అరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్ తల్లి ఆరెల్లి గట్టు మల్లమ్మ ఇటీవల అకాల మరణం చెందగా బుధవారం బిజెపి ఓ బి సి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, పెరిక సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కందుల సంధ్యారాణి పోశం వారి కుటుంబాన్ని పరామర్శించి గట్టు మల్లమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి పెరిక సంఘం జిల్లా అధ్యక్షుడు దుండే మల్లేశం, లసెట్టి చంద్రమౌళి, రాజాపూర్ మాజీ ఉపసర్పంచ్ ఉగ్గే కుమార్, పెరిక సంఘం నాయకులు బత్తుల రమేష్, దుండే రాజేందర్, బియ్యాల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మేలు జరిగేలా భూముల రీసర్వే

ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలి...

- రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- నవంబర్ నెలాఖరులోగా ప్రతి జిల్లాలో తొలి విడత రీసర్వే లక్ష్యాన్ని పూర్తి చేయాలి..
- రీసర్వేలో నాణ్యతకు ప్రాధాన్యత..
- తొందర పాటుతో తప్పులకు తావివ్వకూడదు.
- మండలాల వారీగా ప్రత్యేక సర్వే బృందాలను ఏర్పాటు..
- లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలి..
- రీసర్వేలో అవకతవకలకు పాల్పడితే సస్పెన్షన్‌తో పాటు క్రిమినల్ కేసులు నమోదు..
- భూముల రీసర్వే ప్రక్రియపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి..

ఖమ్మం/ టౌన్ నవంబర్ 11 (అక్షరం న్యూస్)

రాష్ట్రంలో భూముల రీసర్వే ప్రక్రియను ప్రజలకు మేలు జరిగేలా, సానుకూల వాతావరణంలో పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు.రీసర్వేలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, తొందరపాటుతో ఎలాంటి తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.బుధవారం హైదరాబాద్ నుంచి రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో భూముల రీసర్వే ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి కలెక్టరేట్ నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, భూముల రీసర్వే ప్రక్రియపై ఇప్పటికే పలుమార్లు సమావేశాలు నిర్వహించామని, ఉమ్మడి జిల్లాలలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ జిల్లా స్థాయి నుంచి మండల స్థాయి వరకు రెవెన్యూ అంశాలపై సమీక్షలు నిర్వహించామని తెలిపారు.రీసర్వే ఫలితాలు క్షేత్రస్థాయిలో ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు గ్రౌండ్ రిపోర్టులను సేకరిస్తున్నామని పేర్కొన్నారు. రీసర్వే సందర్భంగా ఎదురవుతున్న సమస్యలు, లోపాలు, వాటి పరిష్కార మార్గాలపై సమగ్రంగా చర్చిస్తున్నామని తెలిపారు. రీసర్వే ఎస్ఓపీని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. భూముల రీసర్వేకు సంబంధించి రూపొందించిన ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్ఓపీ)ను అధికారులు పక్కాగా అమలు చేయాలని మంత్రి సూచించారు.క్షేత్రస్థాయి నివేదికల ఆధారంగా అవసరమైన మార్పులు, సవరణలు చేపట్టాలని తెలిపారు. కేవలం ఉన్నతాధికారులను సంతృప్తిపరిచే నివేదికలు కాకుండా క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించేలా నివేదికలు ఉండాలని స్పష్టం చేశారు.నవంబర్ నెలాఖరులోగా ప్రతి జిల్లాలో తొలి విడతలో ఎంపిక చేసిన 70 గ్రామాలతో పాటు నక్షా లేని గ్రామాల్లో రీసర్వే ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. రీసర్వే పనుల్లో అధికారులు పూర్తి బాధ్యతతో, చిత్తశుద్ధితో వ్యవహరించాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.

మండలాల వారీగా సర్వే బృందాల ఏర్పాటు..



ప్రతి మండలంలో రీసర్వే కోసం అవసరమైన ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. అందుబాటులో ఉన్న లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. రీసర్వే పనులను వేగవంతం చేసేందుకు సర్వే బృందాల సంఖ్యను పెంచాలని తెలిపారు. రాబోయే ఏడాదిన్నర కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా మూడు విడతల్లో భూముల రీసర్వే ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ మేరకు జిల్లా కలెక్టర్లు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆదేశించారు.

రీసర్వేలో పారదర్శకత, నాణ్యత తప్పనిసరి..

రీసర్వే జరిగే సమయంలో సంబంధిత గ్రామాల రైతులకు ముందుగానే సమాచారం అందించాలని, స్థానిక రైతుల సమక్షంలోనే సర్వే ప్రక్రియ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. రైతులకు ముందస్తుగా నోటీసులు జారీ చేయడంతో పాటు అవసరమైన కౌన్సెలింగ్ నిర్వహించాలని తెలిపారు. సర్వే నివేదికల పై అభ్యంతరాలు ఎలా సమర్పించాలి, ఎక్కడ సమర్పించాలి, ఏ విధంగా పరిష్కరించబడతాయి అనే అంశాలపై ప్రజలకు ముందుగానే అవగాహన కల్పించాలని ఆదేశించారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో సర్వే వివరాలను ప్రజలకు తెలియజేస్తూ దండోరా వేయించాలని, ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించేందుకు అవకాశం కల్పించాలని తెలిపారు.ప్రజలకు రీసర్వే వివరాలు పూర్తిస్థాయిలో తెలియజేయాలని, వచ్చిన అభ్యంతరాలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. రీసర్వే పూర్తయిన ప్రాంతాల్లో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను క్యూఆర్ కోడ్‌తో అందించనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో భూముల సర్వే వివరాలు, రికార్డులు కచ్చితత్వంతో ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

అసైన్డ్ భూముల పట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి..

అసైన్డ్ భూములకు సంబంధించి పట్టాలు అసలైనవా, నకిలీవా అనే అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని మంత్రి సూచించారు. పట్టా పొందిన వ్యక్తులే ప్రస్తుతం ఆ భూములపై ఆధీనంలో ఉన్నారా లేదా అనే విషయాన్ని నిర్ధారించాలని తెలిపారు. గతంలో ఒకరికి పట్టా ఇచ్చినప్పటికీ ప్రస్తుతం మరొకరు భూమిని అనుభవిస్తున్నట్లయితే, ప్రస్తుత అనుభవదారుడు అర్హుడా కాదా అనే అంశాన్ని నిబంధనల ప్రకారం పరిశీలించాలని ఆదేశించారు.పట్టాలో పేర్కొన్న విస్తీర్ణానికి, క్షేత్రస్థాయిలో ఉన్న భూమి విస్తీర్ణానికి మధ్య తేడాలు ఉన్నాయా అనే విషయాన్ని కూడా క్షేత్రస్థాయిలో సరిచూసుకోవాలని తెలిపారు.సాగునీటి చెరువులు, రహదారులు, కుంటలు, ఇతర అభివృద్ధి పనుల కోసం గతంలో భూసేకరణ చేసిన భూములకు సంబంధించిన సర్వే నంబర్లలో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రీసర్వే ప్రక్రియలో ఎలాంటి సమస్యలు పెండింగ్‌లో ఉండకుండా అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించాలని సూచించారు.రీసర్వేలో ఏ అధికారి అయినా అక్రమాలకు, అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, సస్పెన్షన్‌తో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మంత్రి హెచ్చరించారు. ప్రజలకు భవిష్యత్తులో ఎలాంటి భూ వివాదాలు తలెత్తకుండా, రీసర్వే ప్రక్రియను నాణ్యతతో, పారదర్శకంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.రెండో విడత ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి దాదాపు 2 లక్షల ఇళ్ల నిర్మాణ ప్రక్రియ ఇప్పటికే 4-5 నెలలు దాటిందని, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. మొదటి విడత నుంచి సుమారు 60 వేల ఇళ్లు స్పిల్ ఓవర్ అయ్యాయని, మొత్తంగా 2.60 లక్షల ఇళ్లలో ఇప్పటివరకు 40,000 నుండి 50,000 వరకు మాత్రమే ఫైనలైజ్ అయ్యాయని మంత్రి అన్నారు. లబ్ధిదారుల జాబితాను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేసి, పనులను వేగవంతం చేయడానికి జిల్లా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంత్రి ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం 2 లక్షల ఇళ్లకు అనుమతులు ఇచ్చిందని, అయితే జాబ్ కార్డ్‌ల అప్‌లోడ్ ప్రక్రియ మందకొడిగా సాగుతోందని మంత్రి అన్నారు. జాబ్ కార్డ్‌ల అప్‌లోడ్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. వారంలోగా ఎంపిడిఓ లకు తగిన సూచన లిచ్చి ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. వివిధ జిల్లాల్లో అరకొరగా ఉన్న రెండు పడక గదుల ఇళ్లను ఈ నెలాఖరు కల్లా ఏ స్థాయిలో ఉన్నా లబ్ధిదారులకు అందజేయాలని మంత్రి అన్నారు.వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ మాట్లాడుతూ, జిల్లాలో సర్వే ప్రక్రియ వేగంగా జరుగుతోందని, ఇప్పటివరకు 18 రెవెన్యూ గ్రామాల్లో షేప్ ఫైల్స్ పూర్తి కాగా, 23,519 ఎల్‌పిఎంల పరిధిలోని 31,399 ఎకరాలకు నోటీసులు జారీ చేయడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం 14 గ్రామాల్లో సర్వే పనులు కొనసాగుతున్నాయన్నారు. సర్వే సందర్భంగా విస్తీర్ణం తగ్గినా లేదా పెరిగినా, అక్కడ కూర్చుని ప్రాపర్ రెవెన్యూ విచారణ పూర్తి చేసి సరైన నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలిపారు. సివిల్ కోర్టు కేసులు లేదా తీవ్ర వివాదాలు ఉంటే తప్ప, మిగిలిన భూ సమస్యలన్నింటినీ పరిష్కార చర్యలు చేపడుతున్నట్లు అన్నారు. భూ సర్వే వేగంగా, పారదర్శకంగా జరిగేలా చూడటానికి సర్వేకు ముందే గ్రామంలో రైతులకు జెండాలు పంపిణీ చేస్తున్నామని, రైతులు తమ భూమి సరిహద్దుల్లో జెండాలను పాతడం వల్ల పొరుగు రైతులతో ముందే అవగాహన కుదిరి, చిన్న చిన్న వివాదాలు అక్కడికక్కడే పరిష్కారమవుతున్నాయనీ తెలిపారు. ఎల్ఆర్‌యుపి సమయం నాటి వ్యత్యాసాలు, సక్సెషన్ (వారసత్వ) కేసులు, పాత సాదా బైనామాలు, రికార్డుల్లో లోపాలపై ప్రత్యేక దృష్టి సారించి రెవెన్యూ ఆర్డర్ల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నిర్ణీత సమయంలో లక్ష్యం మేరకు రిసర్వే ప్రక్రియ పూర్తికి చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ అన్నారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ఏడి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ రాజేందర్, అధికారులు, తదితరులు, పాల్గొన్నారు.

గులాబీ గూటికి కాంగ్రెస్, బీజేపీ నాయకులు

మాజీ ఎమ్మెల్యే షిండే



మద్నూర్ / నవంబర్ 11 (అక్షరం న్యూస్ -- కామారెడ్డి):

మద్నూర్--డోంగ్లీ ఉమ్మడి మండలాల రాజకీయాల్లో బీఆర్ఎస్ పార్టీలో జరిగిన నాయకుల చేరికలు చర్చనీయాంశంగా మారాయి. డోంగ్లీ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీ సమావేశం ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు తమ అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు.మొఘ గ్రామ మాజీ సర్పంచ్ సూర్యకాంత్ పటేల్, రవి పటేల్, పెద్ద తకాలి మాజీ ఎంపీటీసీ అహ్మద్‌తో పాటు ఉమ్మడి మండలాల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కొత్తగా చేరిన నాయకులకు పార్టీ తరఫున స్వాగతం పలుకుతూ, రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు.

కేసీఆర్ పదేళ్ల పాలనను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ నాయకత్వంలో కొనసాగిన పదేళ్ల పాలనలో అమలైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు.రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, విద్యుత్ సమస్యలతో రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. రైతులకు రైతు బీమా అందించే విషయంలోనూ సమస్యలు ఉన్నాయని ఆరోపించారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన డిమాండ్ చేశారు.

స్థానిక ఎన్నికలకు ఇప్పటి నుంచే సమాయత్తం కావాలి

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు పార్టీకి కీలకమని హన్మంత్ షిండే పేర్కొన్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో ప్రజలతో నిరంతరం సంబంధాలు కొనసాగిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముందుండాలని సూచించారు. కొత్తగా పార్టీలో చేరిన నాయకులకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తూ అందరినీ కలుపుకొని ముందుకు సాగాలని అన్నారు.

గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి

ఇతర పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్‌లో చేరడం ఉమ్మడి మండలాల పరిధిలో రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. కొత్తగా చేరిన నాయకులు, వారి అనుచరులతో కలిసి పార్టీ కార్యకలాపాలను గ్రామస్థాయిలో విస్తరించేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు రాజు పటేల్, బన్సీ పటేల్, ప్రధాన కార్యదర్శి గోవింద్, కాశీనాథ్ పటేల్, గఫ్ఫార్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే సమక్షంలో జరిగిన ఈ చేరికల కార్యక్రమం మద్నూర్--డోంగ్లీ ఉమ్మడి మండలాల్లో బీఆర్ఎస్ పార్టీ రాజకీయ కార్యకలాపాలకు కొత్త ఊపునిచ్చే పరిణామంగా పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి.

జమ్మికుంటలో ఉచిత మెగా వైద్య శిబిరం

- ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.. మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్



కరీంనగర్/జమ్మికుంట/, నవంబర్ 11/అక్షరం న్యూస్:

జమ్మికుంట పట్టణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ నెల 15వ తేదీన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ తెలిపారు.తన ఆధ్వర్యంలో హనుమకొండ బాలసముద్రంలోని అంజలి కిడ్నీ కేర్ సెంటర్ వారి సహకారంతో పట్టణంలోని బాలికల పాఠశాలలో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నవంబర్ 15వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని తెలిపారు.ఈ శిబిరంలో యూరాలజిస్ట్, యూరో గైనకాలజిస్ట్, కిడ్నీ సర్జన్ డాక్టర్ గీతాంజలి నరేష్, ఫ్యామిలీ ఫిజీషియన్, డయాబెటాలజిస్ట్ డాక్టర్ నరేష్ సముద్రాల వైద్య సేవలు అందించనున్నారు.కిడ్నీ సంబంధిత సమస్యలు, మూత్ర సంబంధిత వ్యాధులు, మహిళల ఆరోగ్య సమస్యలు, మధుమేహం తదితర సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని చైర్మన్ కోరారు. పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు అబ్జర్వర్‌గా జిట్టబోయిన శ్రీను

- కోరపల్లి జెడ్పీహెచ్ఎస్ వ్యాయామ విద్య ఉపాధ్యాయుడికి గుర్తింపు



కరీంనగర్/ జమ్మికుంట/ నవంబర్ 11 /అక్షరం న్యూస్:

మహబూబ్‌నగర్ జిల్లా భగీరథ కాలనీ, మాధవ్‌నగర్‌లో నిర్వహించనున్న ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలబాలికల రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు కరీంనగర్ జిల్లా కోరపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల వ్యాయామ విద్య ఉపాధ్యాయుడు జిట్టబోయిన శ్రీను అబ్జర్వర్‌గా నియమితులయ్యారు. రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణలో కీలక బాధ్యతలు అప్పగించడం ఆయనకు లభించిన గుర్తింపుగా క్రీడా వర్గాలు పేర్కొంటున్నాయి. రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలను నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా, క్రమబద్ధంగా నిర్వహించడంలో అబ్జర్వర్‌గా శ్రీను పర్యవేక్షణ బాధ్యతలు నిర్వర్తించనున్నారు. క్రీడాకారులకు న్యాయబద్ధమైన పోటీ వాతావరణం కల్పించడంలో ఆయన కీలక పాత్ర పోషించనున్నారు.ఈ సందర్భంగా జిట్టబోయిన శ్రీనును హెచ్ఎం శ్రీనివాస్ రెడ్డి, ఎస్‌జీఎఫ్ బాన్సీలాల్, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేందర్, కోశాధికారి కలిగేటి శ్రీనివాస్, కరీంనగర్ పీఈటీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బాబు శ్రీనివాస్, శ్రీనివాస్, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, సీనియర్ వ్యాయామ విద్య ఉపాధ్యాయులు కొమురోజు కృష్ణ, అంతాడ్పుల శ్రీనివాస్, సంపత్ రావు, జెట్టిపల్లి అశోక్, వీర్పాల్ రెడ్డి, రాజ్‌కుమార్, అనూప్ రెడ్డితో పాటు పలువురు వ్యాయామ విద్య ఉపాధ్యాయులు, హ్యాండ్‌బాల్ క్రీడాభిమానులు అభినందించారు.భవిష్యత్తులో శ్రీను మరిన్ని ఉన్నత బాధ్యతలు చేపట్టి, క్రీడారంగ అభివృద్ధికి విశేష సేవలందించాలని వారు ఆకాంక్షించారు.

పాఠశాలలో ప్యానెల్ బృందం విద్యా పరిశీలన



ఓదెల/ నవంబర్ 11(అక్షరం న్యూస్)

ఓదెల:కొలనూరు:స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో విద్యాశాఖ ప్యానెల్ బృందం ఆధ్వర్యంలో అకడమిక్ తనిఖీ నిర్వహించారు. ప్యానెల్ టీమ్ అధికారి ఆగయ్య నేతృత్వంలో పాఠశాలలో బోధనాభ్యసన ప్రక్రియలను, విద్యార్థుల అభ్యసన స్థాయిలను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా తరగతి గదులను సందర్శించి రికార్డులను, డైరీలను పరిశీలించడంతో పాటు విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నిర్వహించే రెమేడియల్ ఉపశమన తరగతుల నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, విద్యార్థులందరూ కనీస అభ్యసన సామర్థ్యాలు సాధించేలా బోధన సాగాలని ఉపాధ్యాయులకు తగిన సూచనలు చేశారు.అలాగే డిజిటల్ విద్యలో భాగంగా ఖాన్ అకాడమీ వేదికను విద్యార్థులు ఏ విధంగా వినియోగిస్తున్నారనే అంశాన్ని పరిశీలించారు. విద్యార్థులకు గణితం, సైన్స్ తదితర క్లిష్టమైన అంశాలు సులభంగా అర్థమయ్యేందుకు ఖాన్ అకాడమీ ద్వారా డిజిటల్ కంటెంట్‌ను గరిష్టంగా ఉపయోగించుకోవాలని, సాంకేతికతను జోడించి ఫలితాలు మెరుగుపరచాలని ప్యానెల్ టీమ్ సూచించింది.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిట్టూరి యేసుదాసు, ఉపాధ్యాయ బృందం మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నుంచి దాసరి శివ సస్పెన్షన్

రామగిరి, పెద్దపల్లి జిల్లా, సెప్టెంబర్ 11 (అక్షరం న్యూస్):

రామగిరి మండలం బేగంపేట గ్రామానికి చెందిన దాసరి శివను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొరుక్కొప్పుల తులసిరాం గౌడ్ తెలిపారు.పార్టీ క్రమశిక్షణ చర్యల్లో భాగంగా పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకు ఈ చర్య తీసుకున్నట్లు వెల్లడించారు. పార్టీ క్రమశిక్షణను ఎవరైనా ఉల్లంఘిస్తే వారిపై సస్పెన్షన్, బహిష్కరణ వంటి చర్యలు తప్పవని స్పష్టం చేశారు.ప్రతి ఒక్క కాంగ్రెస్ పార్టీ నాయకుడు, కార్యకర్త పార్టీ నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి పనిచేయాలని ఈ సందర్భంగా తులసిరాం గౌడ్ పిలుపునిచ్చారు.

ఎల్‌నినో ప్రభావంతో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు



ఓదెల/ నవశీబర్11(అక్షరం న్యూస్)

ఓదెల: ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో ఎండల తీవ్రత పెరిగి గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తు చర్యలకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా ఓదెల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అనిల్ రెడ్డి ఆధ్వర్యంలో సర్పంచులు కార్యదర్శుల ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సరఫరా పరిస్థితిపై సమీక్షించారు. గ్రామాల్లోని వాటర్ ట్యాంకుల పనితీరు, మరమ్మతులు, పైపులైన్ల లీకేజీలు, ఇతర సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఎక్కడైనా వాటర్ ట్యాంకులు మరమ్మతులకు గురైతే తక్షణమే బాగు చేయించాలని, పైపులైన్ సమస్యల కారణంగా తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని, ప్రతి గ్రామంలో తాగునీటి సరఫరాపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని ఎంపీడీవో అనిల్ రెడ్డి సూచించారు. ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఇంటర్ డి ఈ సతీష్ గ్రేడ్ డి ఈ అనిల్ ఏఈలు సూర్య తేజ శ్రీనివాస్ వివిధ గ్రామాల సర్పంచులు పంచాయతీ సెక్రటరీ పాల్గొన్నారు

తెలంగాణ రాష్ట్ర ఉత్తమ రీజినల్ కోఆర్డినేటర్‌గా శ్రీకాంత్ గండ్రకు అవార్డు ప్రదానం



జనగామ జిల్లా/రఘునాథపల్లి/(అక్షరం న్యూస్) నవంబర్ 11:

జాతీయ విద్యా దినోత్సవం, మైనార్టీ సంక్షేమ దినోత్సవం సందర్భంగా నల్గొండ జిల్లా మైనార్టీ రెసిడెన్షియల్ విద్యాసంస్థల రీజినల్ కోఆర్డినేటర్ శ్రీకాంత్ గండ్ర రాష్ట్ర స్థాయి ఉత్తమ రీజినల్ కోఆర్డినేటర్ అవార్డును అందుకున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మైనార్టీ సంక్షేమ శాఖ ఎండీ అజహరుద్దీన్ చేతుల మీదుగా బుధవారం ఆయన ఈ ప్రతిష్టాత్మక అవార్డును స్వీకరించారు.నల్గొండ జిల్లాలోని మైనార్టీ రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో పదో తరగతి (ఎస్ఎస్సి) ఫలితాల్లో 100% ఉత్తీర్ణత, ఇంటర్మీడియట్ ఫలితాల్లో 98% అద్భుత ఫలితాలు సాధించడంలో శ్రీకాంత్ గండ్ర విశేష కృషి చేశారు.

సేవలకు గుర్తింపు.....

మైనార్టీ విద్యాసంస్థల బలోపేతానికి, విద్యార్థుల ఉత్తమ ఫలితాల కోసం అందించిన విలువైన సేవలను గుర్తించి ప్రభుత్వం ఆయనకు ఈ రాష్ట్ర స్థాయి పురస్కారాన్ని అందజేసింది.ఈ సందర్భంగా శ్రీకాంత్ గండ్ర మాట్లాడుతూ.. తనకు నిరంతరం మార్గదర్శనం చేస్తూ ప్రోత్సహిస్తున్న కార్యదర్శి శ్రీ బి. షఫియుల్లా కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే తనకు ఈ అవార్డును అందజేసిన తెలంగాణ ప్రభుత్వానికి, కుటుంబ సభ్యులకు మరియు జిల్లాలోని మైనార్టీ విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయ బృందానికి ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో కూడా విద్యార్థుల ఉన్నత ప్రమాణాల కోసం మరింత అంకితభావంతో పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు.

ఎల్‌నినో ప్రభావంతో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

- ఎంపీడీవో బద్రి శైలజ రాణి
- నీటి ఎద్దడి నివారణకు మండల స్థాయి సమన్వయ సమావేశం



రామగిరి, పెద్దపల్లి జిల్లా, నవంబర్ 11 (అక్షరం న్యూస్):

ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా రాబోయే వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రామగిరి ఎంపీడీఓ బి. శైలజారాణి సూచించారు. మంగళవారం రామగిరి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు చేపట్టాల్సిన చర్యలు, ముందస్తు ప్రణాళికపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో మండల స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామపంచాయతీల పరిధిలో ఉన్న తాగునీటి సమస్యలు, నీటి వనరుల పరిస్థితి, వేసవిలో నీటి సరఫరాకు ఎదురయ్యే ఇబ్బందులపై చర్చించారు. ప్రతి గ్రామంలో తాగునీటి అవసరాలను గుర్తించి, సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని అధికారులకు, సర్పంచులకు సూచించారు. తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.ఈ సమావేశంలో ఎంపీఓ సమ్మిరెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు డి. రాజ్‌కుమార్ (ఇంట్ర), ఖలీల్ (గ్రిడ్), అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఎస్. మధు (ఇంట్ర), సాయి కృష్ణ (గ్రిడ్), సూపరింటెండెంట్ ఉమేష్, ఈసీ మౌనిక, గ్రామ సర్పంచులు రవీందర్ (బుధవారంపేట), రేండ్ల శారద మురస్వామి (కల్వచర్ల), వనం రాంచందర్ రావు (లద్నాపూర్), కొండవీనా దివ్య సుధాకర్ యాదవ్ (నాగేపల్లి), రొడ్డ మౌనిక కుమార్ (నవాబుపేట), చిందం మహేష్ (పన్నూర్), పుల్లెల భాగ్యలక్ష్మి-కొమురయ్య (రాజాపూర్), పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఓదెల లయన్స్ విజన్ సెంటర్‌లో ప్రతిఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం వంశీ



ఓదెల /నవంబర్ 11(అక్షరం న్యూస్)

కంటి శుక్లాలు,చెడు మాంసం ఉన్నవారికి ఉచితంగా ఫాకో శస్త్ర చికిత్సలు:లయన్స్ క్లబ్ విజన్ కేర్ వ్యవస్థాపక అధ్యక్షులు పూదరి దత్తాగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని లగిశెట్టి వంశీ పేర్కొన్నారుఓదెల:మండల కేంద్రంలోని లయన్స్ విజన్ సెంటర్‌లో ప్రతి ఆదివారం ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ విజన్ కేర్ వ్యవస్థాపక అధ్యక్షులు, కంటి వైద్య నిపుణులు పూదరి దత్తాగౌడ్ తెలిపారు తెలిపారని.ఓదెలలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పక్కన గల లక్ష్మీ ఐ కేర్ ఆప్టికల్స్ ఆవరణలో అనుభవజ్ఞులైన ఆప్తాల్మిక్ ఆఫీసర్ లగిశెట్టి వంశీ ప్రత్యేక సహకారంతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా పూదరి దత్తాగౌడ్ మాట్లాడుతూ... కంటి సమస్యలతో బాధపడుతున్న పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే తమ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. కంటి శుక్లాలు (క్యాటరాక్ట్) ఉన్న రోగులకు ఎలాంటి కోత, కుట్టు లేని అత్యాధునిక 'ఫాకో' పద్ధతి ద్వారా ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామని వెల్లడించారు.ఆపరేషన్ అవసరమైన వారికి ఉచిత రవాణా సదుపాయం,నాణ్యమైన భోజనంతో పాటు శస్త్ర చికిత్సకు ముందు చేసే అన్ని రకాల రక్త పరీక్షలను కూడా పూర్తిగా ఉచితంగానే అందజేస్తున్నట్లు స్పష్టం చేశారు.అలాగే కంటిలో చెడు మాంసం సమస్యతో బాధపడుతున్న వారికి కూడా ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తామని తెలిపారు.కావున ఓదెల మండల పరిధిలోని గ్రామాల ప్రజలు,పరిసర ప్రాంతవాసులు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.శిబిరానికి సంబంధించి ఇతర వివరాల కోసం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పక్కన ఉన్న లక్ష్మీ ఐ కేర్ ఆప్టికల్స్‌లో ఆప్తాల్మిక్ ఆఫీసర్ లగిశెట్టి వంశీని నేరుగా లేదా 7032975096 లో సంప్రదించాలని సూచించారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే దాసరి



ఓదెల/ నవంబర్ 11(అక్షరం న్యూస్)

వడ్లపడ్గ గుంపుల గ్రామాలలో మృతి చెందిన పలువురు కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఈ సందర్భంగా మడకఆవుల రాజయ్య సంవత్సరీకం గుంపుల గ్రామములో మాజీ సర్పంచ్ ఉప్పుల సంపత్ కుమార్ తండ్రి ఉప్పుల మల్లేశం ఇటీవల అనారోగ్యం మృతి చెందడంతో ఇరువుర ఫోటో వద్ద పూలు వేసి నివాళులు అర్పించిన మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి ఈ సందర్భంగా సంపత్ కుమార్,మడక ఆవుల రవీందర్ లకు కు మనోధైర్యం చెప్పి వారి కుటుంబ అనికి అండగాఉంటా అని మనోహర్ రెడ్డి తెలియజేసారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ యూత్ మండలాధ్యక్షుడు మ్యాడగోని శ్రీకాంత్ గౌడ్,రౌతు జలపతి, మారెల్లి రవీందర్ గ్రామ అధ్యక్షులు గొర్ల కుమార్,గంధం శ్రీనివాస్,గ్రామ యూత్ అధ్యక్షులు తాళ్లపల్లి ప్రశాంత్ గౌడ్,నోముల ఇంద్రారెడ్డి,మర్రి కుమార్,సదారెడ్డి, ఐలయ్య,కేశవరెడ్డి, నిలకంఠ చారీ,సత్యనారాయణ రెడ్డి,రమేష్,తుడి సంపత్,మొగిలి,రాసాల అశోక్,ఇట్టెం శ్రీనివాస్,పండ్రాజుల సాధనందం, తిప్పరపు శ్రీనివాస్, కొసన సధయ్య, ఆగయ్య,గణేష్, సంపత్,బుచ్చయ్య, సధయ్య,అనిల్,నరేష్,ఉప్పుల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మాదకద్రవ్యాలకు అలవాటుపడి విలువైన జీవితాలను అంధకారంలోకి నెట్టుకోవద్దు

- డీసీపీ రామిరెడ్డి



ఓదెల /నవంబర్ 11 (అక్షరం న్యూస్)

ఓదెల: మాదకద్రవ్యాలకు అలవాటుపడి విద్యార్థులు తమ విలువైన జీవితాలను అంధకారంలోకి నెట్టుకోవద్దని డీసీపీ రామిరెడ్డి సూచించారు. ఓదెల మోడల్ స్కూల్‌లో పోలీసుల ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మోటివేషన్ స్పీకర్ మహారాజ్ ఎస్పీ నాయక్ హాజరై ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిదండ్రులు మీ భవిష్యత్తు కోసం ఎంతో కష్టపడుతున్నారని ఆ కష్టాన్ని ప్రతి ఒక్క విద్యార్థి గుర్తించి ఒక ఛాలెంజ్ గా తీసుకొని ఉన్నత శిఖరాలకు ఎదిగే విధంగా చదవాలని పిలుపునిచ్చారు డ్రగ్స్ మాదకద్రవ్యాలు మరియు సైబర్ నేరాల పట్ల విద్యార్థుల అప్రమత్తంగా ఉండాలని వీటి బారిన పడ్డ విద్యార్థులు సచ్చేదాకా దాని మైకంలో నుండి బయటకు రారని విద్యార్థులు ఇలాంటి విషయాలకు దూరంగా ఉండి చాలా అప్రమత్తంగా ఉంది మంచి ఉన్నత చదువులకు చదివి తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని సూచించారుఈ సందర్భంగా డీసీపీ రామిరెడ్డి మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత భవిష్యత్తు నాశనమవుతుందని, ఆరోగ్యపరంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించాలని సూచించారు. మాదకద్రవ్యాలకు ఒక్కసారి అలవాటు పడితే వాటి నుంచి బయటపడటం ఎంతో కష్టమని, అందువల్ల వాటికి దూరంగా ఉండటమే ఉత్తమమని పేర్కొన్నారు.మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

విద్యార్థులు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను తెలుసుకొని, వాటికి దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏసిపి గజ్జి కృష్ణ యాదవ్ సీఐ రంజిత్ రావు ఎస్సై సనత్ కుమార్ రెడ్డి కాల్వ శ్రీరాంపూర్ ఎస్సై జి సుధాకర్ పాఠశాల ప్రిన్సిపాల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రత్నాపూర్ గ్రామంలో పోచమ్మ ఉత్సవాలు ఘనంగా ప్రారంభం



రామగిరి (పెద్దపల్లి జిల్లా) నవంబర్ 11 అక్షరం న్యూస్:

రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో బుధవారం పోచమ్మ కొలుపు ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రతి ఐదు సంవత్సరాలకోకసరి పోచమ్మ కొలుపు ఉత్సవాలు జరుగుతాయి. ఊరంతా సందడి వాతావరణం లో ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు ఆధ్వర్యంలో ఘనంగా పోచమ్మ కొలుపు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. గ్రామ నడిబొడ్డున బొడ్రాయి వద్ద పూజలను నిర్వహించిన సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పల్లె ప్రతిమా పివి రావు మాట్లాడుతూ గ్రామ కట్టుబాటు ప్రకారం పోచమ్మ కొలుపులు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామంలోని రైతులు ప్రజలు యువకులు అన్ని వర్గాల కులస్తులు సుఖ శాంతులతో ఉండాలని కోరుకోవడం జరిగిందన్నారు. దీనికి తోడు పోలిమేరు గ్రామాలైన కల్వచెర్ల, పన్నూరు, నాగపెల్లి, నవాబ్ పేట, బేగంపేట, మేడిపల్లి శివారులోని గ్రామాల ప్రజలు, అన్ని గ్రామాల ప్రజలు సుఖశాంతులతో ఉండాలని కోరుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కనవేన సదానందం విరాళంగా అందించిన పోతరాజు విగ్రహాన్ని మధున పోచమ్మ వద్ద విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. గురువారం బొడ్రాయి వద్ద పోచమ్మ బలి కార్యక్రమం నిర్వహిస్తారు.

జిల్లా స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్





- విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి - - ఎమ్మెల్యే

ఖమ్మం/ వైరా నవంబర్ 11 (అక్షరం న్యూస్)

మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సొసైటీ ఆధ్వర్యంలో 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించి నిర్వహిస్తున్న ఖమ్మం జిల్లా స్థాయి క్రీడా పోటీలు, స్పోర్ట్స్ మీట్‌ను వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. మొసలిమడుగు గ్రామంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గారు జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ఆసక్తి కనబరచాలని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసానికి, క్రమశిక్షణకు, నాయకత్వ లక్షణాల పెంపునకు దోహదపడతాయని పేర్కొన్నారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు.ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభను చాటుకోవాలని, క్రీడల్లో సాధించిన విజయాలు భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదిగేందుకు మార్గం సుగమం చేస్తాయని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి జిల్లా స్థాయి క్రీడా పోటీలు ఎంతగానో ఉపయోగ పడతాయని అన్నారు. ఈ క్రీడా పోటీల్లో వివిధ గురుకుల విద్యాలయాలకు చెందిన విద్యార్థినులు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ తదితర క్రీడా విభాగాల్లో పాల్గొని తమ ప్రతిభ ను ప్రదర్శించనున్నారు .ఈ కార్యక్రమంలో గురుకుల విద్యాలయాల అధికారులు, ఆర్ సి ఓ రాంబాబు, ఎంఈఓచావా శ్రీనివాసరావు ప్రిన్సిపాళు , ఉపాధ్యాయులు, క్రీడా శిక్షకులు, మరియు సర్పంచ్ వేల్పుల జ్యోతి, మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు దాసరి దానియేలు, మార్క్ ఫైడ్ మాజీ వైస్ ఛైర్మన్ బొర్రా రాజశేఖర్, రాంపూడి రోశయ్య, టి పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, డాక్టర్స్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, వైరా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వీరంశెట్టి సీతారాములు, వైస్ ఛైర్మన్ కట్ల సంతోష్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి పమ్మి అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డ పుల్లయ్య, కోసూరి శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

- రైతులు, వ్యవసాయ కూలీలను ఆదుకోవాలి.. కరువు సహాయక చర్యలు వెంటనే చేపట్టాలి



జ్యోతినగర్, ఎన్టీపీసీ నవంబర్ 11 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : పెద్దపల్లి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి, జిల్లాలోని కరువు ప్రభావిత మండలాల్లో తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లూరి మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.బుధవారం ఎన్టీపీసీ ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో గుండేటి మల్లేశం అధ్యక్షతన జరిగిన ఏఐకేఎంఎస్ పెద్దపల్లి జిల్లా కమిటీ సమావేశంలో కొల్లూరి మల్లేశం మాట్లాడుతూ.. కరువు పరిస్థితుల కారణంగా రైతులు పంటలు నష్టపోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వ్యవసాయ పనులు లేక కూలీలు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం కరువు మండలాల ప్రకటనతో ప్రభుత్వం సరిపెట్టకుండా బాధిత రైతులు, కూలీలు, సామాన్య ప్రజలకు తక్షణ ఉపశమనం కల్పించాలని కోరారు.పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని, వ్యవసాయ రుణాల విషయంలో ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పనులు విస్తృతంగా కల్పించడంతో పాటు పనిదినాలను పెంచాలని, పశువులకు మేత, ప్రజలకు తాగునీరు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం ధరలను నియంత్రించి సామాన్య ప్రజలకు ఉపశమనం కల్పించాలని, రైతులు, కూలీలతో పాటు అన్ని వర్గాల ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మెరుగు చంద్రయ్య, జిల్లా నాయకులు ఐ. రాజేశం, కే. లింగమూర్తి, గుండు రాజయ్య, లింగంపల్లి సెంటర్, మధుకర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రామగుండం రైల్వే స్టేషన్ అభివృద్ధికి ఎన్‌టీపీసీ సీఎస్ఆర్ సహకారం కోరిన అనుమాస శ్రీనివాస్

- ప్రయాణికులకు మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి.. సానుకూలంగా స్పందించిన ఎన్‌టీపీసీ యాజమాన్యం



జ్యోతినగర్, ఎన్టీపీసీ నవంబర్ 11 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : రామగుండం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఎన్‌టీపీసీ సంస్థ సామాజిక బాధ్యత నిధుల (సీఎస్ఆర్) నుంచి సహకారం అందించాలని డివిజనల్ రైల్వే సభ్యుడు అనుమాస శ్రీనివాస్ కోరారు. పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ ఆదేశాల మేరకు ఎన్‌టీపీసీ హెచ్ఆర్ విభాగాధిపతి సాగర్ రాజన్ సాహూను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి వినతిపత్రం అందజేశారు.రైల్వే స్టేషన్ ప్రధాన ద్వారం ఎదుట ఉన్న పార్కు ప్రాంతంలో ప్రయాణికులు కూర్చునేందుకు కుర్చీలు, పెద్ద గోడ గడియారాలు ఏర్పాటు చేయాలని, రెండో నంబర్ ప్లాట్‌ఫారంపై ప్రయాణికుల సౌకర్యార్థం మరుగుదొడ్లు నిర్మించాలని వినతిపత్రంలో కోరారు.ఈ వినతిపై ఎన్‌టీపీసీ యాజమాన్యం సానుకూలంగా స్పందిస్తూ, ప్రయాణికులకు అవసరమైన సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు శ్రీనివాస్ తెలిపారు. గతంలోనూ ఎన్‌టీపీసీ సీఎస్ఆర్ విభాగం ఆధ్వర్యంలో రామగుండం రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫారాలపై కూర్చునే కుర్చీలు, వాటర్ ఫ్రిడ్జ్‌లు ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు.ఎంపీ గడ్డం వంశీకృష్ణ చొరవతో రైల్వే ప్రయాణికుల సమస్యలను ఎన్‌టీపీసీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొంటూ, ప్రయాణికుల సౌకర్యాల కల్పనకు సానుకూలంగా స్పందించిన ఎన్‌టీపీసీ యాజమాన్యానికి రామగుండం ప్రయాణికుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

అడవిలోనే జీవన పోరాటం .. అభివృద్ధి జాడలేని గుత్తికోయల గూడెం!

- కన్నాయిగూడెం పంచాయతీ సమీపంలో 22 కుటుంబాల దయనీయ జీవనం
- విద్య, వైద్యం అందక ఇబ్బందులు పడుతున్న 22 గిరిజన కుటుంబాలు



భద్రాద్రి కొత్తగూడెం / అశ్వారావుపేట / నవంబర్ 11 / అక్షరం న్యూస్ :అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలోని కన్నాయిగూడెం పంచాయతీ సమీపంలో దట్టమైన అటవీ ప్రాంతంలో గుత్తికోయల గూడెం ఉంది. ఇక్కడ 22 కుటుంబాలకు చెందిన 50 మందికి పైగా గిరిజనులు నివసిస్తున్నారు. మండల కేంద్రానికి సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గూడెం ఇప్పటికీ అభివృద్ధికి నోచుకోలేదు. కనీస సౌకర్యాలు లేక అడవి మధ్యలో అనేక ఇబ్బందులతో జీవనం సాగిస్తున్నారు.

రాకపోకలకు రహదారి కరువు

గూడేనికి చేరుకోవాలంటే సుమారు ఐదు కిలోమీటర్లు అడవి మార్గంలో కాలినడకన వెళ్లాల్సి వస్తోంది. మధ్యలో వాగులు, వంకలు దాటాల్సి ఉండటంతో వర్షాకాలంలో రాకపోకలు నిలిచిపోతున్నాయి.

నీటి కోసం అవస్థలు

తాగునీటి కుళాయి సౌకర్యం లేక డ్రమ్ముల్లో నీటిని నిల్వ చేసుకుని వినియోగిస్తున్నారు. కర్రలు, తడకలతో నిర్మించుకున్న గుడిసెల్లోనే 22 కుటుంబాలు నివసిస్తున్నాయి.


చిన్నారుల భవిష్యత్తుపై ఆందోళన

గూడెంలో సుమారు 18 మంది చిన్నారులు ఉన్నప్పటికీ విద్యా సౌకర్యాలు అందుబాటులో లేక చదువుకు దూరమవుతున్నారు. తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లినప్పుడు పిల్లల సంరక్షణ కోసం రోజుకు ఒక కుటుంబం నుంచి ఒకరు గూడెంలోనే ఉండిపోతున్నారు.

ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపులు


కనీస రహదారి, తాగునీరు, విద్య, వైద్య సదుపాయాలు లేకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ పథకాలు, ఐటీడీఏ అధికారుల పర్యవేక్షణ తమకు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమ గూడేనికి కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని గుత్తికోయలు వేడుకుంటున్నారు.

దేశిని చిన్న మల్లయ్యకు ఘన నివాళులు



చిగురుమామిడి, అక్షరం న్యూస్:
కల్లుగీత కార్మిక ఉద్యమనేత,తెలంగాణ ఉద్యమ నాయకులు, మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ దేశిని చిన్న మల్లయ్య 9వ వర్ధంతి వేడుకలు ఆయన స్వగ్రామమైన కరీంనగర్ జిల్లా బొమ్మనపల్లిలో బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చిన్న మల్లయ్య విగ్రహానికి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, కుటుంబ సభ్యులు, సంఘ నాయకులు పూలదండలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ...తెలంగాణ సాయుధ పోరాటంలో కొరియర్‌గా పనిచేసిన చిన్న మల్లయ్య, కమ్యూనిస్టు పార్టీ ద్వారా ప్రజాక్షేత్రంలోకి వచ్చారని కొనియాడారు. 21 ఏళ్ల పాటు సర్పంచిగా, 1978 నుంచి 1994 వరకు ఇందుర్తి నియోజకవర్గం నుంచి వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి నిబద్ధత కలిగిన ప్రజాప్రతినిధిగా నిలిచారని గుర్తుచేసుకున్నారు. కామ్రేడ్ ధర్మభిక్షంతో కలిసి గీత కార్మికుల కోసం సొసైటీల ఏర్పాటు, పెన్షన్లు, ఎక్స్‌గ్రేషియా సాధనలో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. గీత కార్మికులకు ఇచ్చిన ఎన్నికల హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని, పెన్షన్ రూ. 4 వేలకు, ఎక్స్‌గ్రేషియా రూ. 10 లక్షలకు పెంచడంతో పాటు సొసైటీ సభ్యులందరికీ ద్విచక్ర వాహనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.వెంకటనర్సయ్య, జిల్లా అధ్యక్షులు తాళ్లపల్లి తిరుపతి గౌడ్, కోహెడ కొమరయ్య గౌడ్, చిన్న మల్లయ్య కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చొప్పదండి వంద పడకల హాస్పిటల్ ప్రారంబానికి వైద్య శాఖ మంత్రికి ఆహ్వానం



చొప్పదండి/ కరీంనగర్,నవంబర్ 11 (అక్షరం న్యూస్)
చొప్పదండి మండల కేంద్రంలో నిర్మాణం పూర్తి చేసుకున్న 100 పడకల ఆసుపత్రి ప్రారంభోత్సవం కోసం రావాలని నేడు మినిష్టర్ క్వార్టర్స్ లో చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యము తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ని కలిసి ఆహ్వానించారు.ఈ ఆసుపత్రి ప్రారంభంతో చొప్పదండి మండలంతో పాటు చుట్టు పక్కల ఉన్న నాలుగు మండలాల ప్రజలకు చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వారి వెంట చొప్పదండి మండల కాంగ్రెస్ అధ్యక్షులు, సింగిల్ విండో చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ ఫోరం అధ్యక్షులు గుర్రం సుజీత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

నవంబర్ 18న బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించే మహాపాదయాత్రను విజయవంతం చేయాలి

• బీజేపీ జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ



చొప్పదండి /కరీంనగర్,నవంబర్ 11 (అక్షరం న్యూస్).
నవంబర్ 18వ తేదీ బుధవారం రోజున కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహాపాదయాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.బుధవారం చొప్పదండి రూరల్ మండల బీజేపీ ఆధ్వర్యంలో మహాపాదయాత్ర సంబందించిన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా బిజెపి జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల 18న నిర్వహించనున్న మహాపాదయాత్రకు సంబంధించిన కార్యక్రమ వివరాలను పార్టీ నాయకులు, కార్యకర్తలకు వివరించడం జరిగింది. ఈ మహాపాదయాత్రకు ముఖ్య అతిథులుగా బీజేపీ జాతీయ అధ్యక్షులు శ్రీ నితిన్ నబీన్, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఎన్. రామచందర్ రావు గారు హాజరుకానున్నారని తెలిపారు.ఈ మహాపాదయాత్ర భారతీయ జనతా పార్టీకి ఎంతో ప్రతిష్టాత్మకమైన కార్యక్రమమని, పార్టీ శ్రేణులందరూ సమన్వయంతో పనిచేస్తూ పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. గ్రామస్థాయి నుంచి ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి మహాపాదయాత్ర ప్రాధాన్యతను వివరించాలని సూచించారు.పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేసి మహాపాదయాత్రను చారిత్రాత్మక విజయంగా నిలపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శిలు కొమ్మ రమేష్ ఎడ్ల సురేష్ మండల ఉపాధ్యక్షులు గన్ను నరసింహారెడ్డి, బద్దెనపల్లి రాజేందర్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు మడిపల్లి రాజు సీనియర్ నాయకులు బైరగోని కిట్టు గౌడ్, విలాసారం అంజయ్య, దొంతి సారపు సంపత్, తాటికొండ అనిల్ కుమార్, లింగంపల్లి కళ్యాణ్ మాచర్ల శశి కుమార్, రాపెల్లి శ్రీనివాస్, ఒరుగుల తిరుపతి, దామెర మధుసూదన్ రెడ్డి, పోరండ్ల రవీందర్, జిల్లాల రమేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మోటార్ల దొంగతనాలపై పోలీసులు దృష్టి సారించాలి

•-సంగ నరేష్ బిజేవైయం జిల్లా అధ్యక్షులు



చొప్పదండి/ కరీంనగర్,నవంబర్ 11 (అక్షరం న్యూస్
నవోదయ కెనాల్ పరిధిలో 5 హెచ్‌పీ మోటార్లు అపహరణ గురవుతుండడం రైతులకు ఇబ్బందికి గురిచేస్తుందని , గుర్తుతెలియని దొంగలు రైతుల పాలిట శాపంగా మారారని బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సంగ నరేష్ అన్నారు.ఇప్పటికే చొప్పదండి పట్టణానికి చెందిన పలు రైతులకు సంబంధించిన 28 వ్యవసాయ బోరు మోటార్లను రాత్రి పూట దొంగలు అపహరించారని వారు అన్నారు.ఒక్కొక్కటి 5 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన మోటార్లను ఫ్యూజులు తొలగించి మరీ ఎత్తుకెళ్లడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని వారు అన్నారు. వ్యవసాయ ప్రాంతాల్లో రాత్రి గస్తీని ముమ్మరం చేసి, మోటార్ల చోరీలకు పాల్పడుతున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పోలీసులను కోరారు.

కళాశాల వ్యవస్థాపకులు నారాయణరెడ్డి సేవలు చిరస్మరణీయం

•గ్రామీణ విద్యార్థులకు ఉన్నత విద్య అందించడమే ఆయన ఆశయం



జమ్మికుంట, నవంబర్ 11: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలనే గొప్ప లక్ష్యంతో కళాశాలను స్థాపించిన కీ.శే. కె.వి. నారాయణరెడ్డి సేవలు చిరస్మరణీయమని జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ నన్న రామస్వామి అన్నారు.బుధవారం జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల వ్యవస్థాపకులు కె.వి. నారాయణరెడ్డి విగ్రహాన్ని ప్రొఫెసర్ నన్న రామస్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1965లో ఆదర్శ కళాశాల పేరుతో నారాయణరెడ్డి కళాశాలను స్థాపించారని, ఈ కళాశాల గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యకు గొప్ప అవకాశంగా నిలిచిందన్నారు. నాటి నుంచి నేటి వరకు వేలాది మంది విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి ఎదిగారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. రమేష్, పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు మీర్ అహ్మద్ హుస్సేన్, మొలుగూరి సదయ్య, మైస మహేందర్, అన్వర్ బాబు, ఆకుల రాజేందర్ డాక్టర్ కె. రాజేంద్రం, బచ్చు భాస్కర్, శివకుమార్, , టి. రాజ్ కుమార్, జగదీశ్వర్, సయ్యద్ సజ్జు, ప్రసాద్, సుధాకర్, సాయికుమార్, అరుణ్ రాజ్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన గొల్లపెల్లి నరేష్



చొప్పదండి /కరీంనగర్,నవంబర్ 11 (అక్షరం న్యూస్)
తెలంగాణ బార్ కౌన్సిల్ ఆధ్వర్యంలో హైకోర్టు ప్రాంగణంలో నిర్వహించిన న్యాయవాదుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో కరీం నగర్ జిల్లా చొప్పదండి మండల భూపాల పట్నం గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక కార్య కర్త గొల్లపెల్లి నరేష్ న్యాయవాదిగా ప్రమాణ స్వీకారం చేశారు.ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ చైర్మెన్ రామ్ రెడ్డి ,వైస్ ఛైర్మెన్ వెంకట్ యాదవ్ ,బార్ కౌన్సిల్ ప్రతినిధులు నూతన న్యాయవాదులకు న్యాయవాద వృత్తి విలువలు, బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా న్యాయవాది నరేష్ మాట్లాడుతూ... న్యాయవాద వృత్తి అనేది సామాజిక బాధ్యత. ప్రజలకు న్యాయ సహాయం అందించడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. నాకు అండగా నిలిచిన నా కుటుంబ సభ్యులకు, శ్రేయోభిలాషులకు హృదయపూర్వక ధన్యవాదాలు అని నరేష్ తెలిపారు.

పేదల ఆత్మగౌరవానికి ప్రతీక ఇందిరమ్మ ఇండ్లు

•అర్హులైన పేదలందరికీ సొంతింటి కల నెరవేరుస్తాం: అన్నం ప్రవీణ్



కరీంనగర్/ఇల్లందకుంట/, నవంబర్ 11/అక్షరం న్యూస్: పేదల ఆత్మగౌరవానికి ప్రతీక ఇందిరమ్మ ఇండ్ల పథకమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అన్నం ప్రవీణ్ అన్నారు. బుధవారం ఇల్లందకుంట మండలం పాతర్లపల్లి గ్రామంలో ఇందిరమ్మ పథకం కింద మంజూరైన కోడం శ్రీలత--విజేందర్, హనుమాండ్ల రమాదేవి--జయపాల్ రెడ్డి ఇళ్ల నిర్మాణాలకు నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ చొరవతో పాతర్లపల్లి గ్రామానికి ఇప్పటికే 30 ఇళ్లు మంజూరయ్యాయని, ఇందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రజలు ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బైరెడ్డి రమణారెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కోడం శ్రీనివాస్, బైరెడ్డి కొండల్ రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

రెండు ఇసుక లారీలను సీజ్ చేసిన పోలీసులు



ఖమ్మం/ తల్లాడ నవంబర్ 11 (అక్షరం న్యూస్)
తల్లాడ మండలం రామానుజవరం గ్రామంలో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను పోలీసులు సీజ్ చేశారుటాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఆధ్వర్యంలో తల్లాడ పోలీసులు బుధవారం రాత్రి దాడులు నిర్వహించి వాహనాలను పట్టుకున్నట్లు ఖమ్మం టాస్క్‌ఫోర్స్ కార్యాలయం వెల్లడించింది. లారీల్లో సుమారు రూ.60 వేల విలువైన ఇసుక ఉన్నట్లు పోలీసులు తెలిపారు.పోలీసుల అదుపులో ఉన్నవారుసోరివి నరేష్ (38) --- యాదాద్రి జిల్లా నారాయణపురం మండలం చిమ్మిర్యాల గ్రామానికి చెందిన వ్యక్తి. ఎ+30ూా2347 లారీ యజమాని, డ్రైవర్.యెట్టి నవీన్ (33) --- నల్గొండ జిల్లా చిట్యాల మండలం శివనేగూడెం గ్రామానికి చెందిన వ్యక్తి. టీఎస్ 30 టి ఏ 2345లారీ డ్రైవర్.యాదాద్రి జిల్లా చౌటుప్పల్ గ్రామానికి చెందిన అరుట్ల రాజు (40) పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఆయన టీఎస్ 30 టి ఏ 2345నంబరు గల లారీ యజమాని. టీఎస్ 30 టి ఏ 2345నంబర్ల లారీలను ఇసుక లోడుతో సహా స్వాధీనం చేసుకున్నారు.

బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా జాతీయ విద్యా దినోత్సవ వేడుకలు

▪ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు ఘన నివాళులు.



ఖమ్మం/ వైరా నవంబర్ 11 (అక్షరం న్యూస్)
బోనకల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో భారతదేశ తొలి కేంద్ర విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ విద్యావేత్త మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ విద్యా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి లింగంనేని నళినిశ్రీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది, అధ్యాపకులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.
అనంతరం ప్రిన్సిపాల్ శ్రీమతి నళినిశ్రీ మాట్లాడుతూ, భారతదేశ విద్యారంగ అభివృద్ధికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ విశేష కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. స్వతంత్ర భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా దేశ విద్యావ్యవస్థ పటిష్టతకు బలమైన పునాదులు వేశారని తెలిపారు. విద్య అనేది కేవలం ఉద్యోగ సాధనకే పరిమితం కాకుండా వ్యక్తిత్వ వికాసానికి, సమాజ అభివృద్ధికి, దేశ పురోగతికి దోహదపడే శక్తివంతమైన సాధనమని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతను అలవర్చుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎ. మోహన్, అధ్యాపకులు జోనతాన్ బాబు, లక్ష్మీకాంతం, పద్మావతి, రామకృష్ణ, రమేష్, రాజేంద్ర, ప్రియకుమార్ రెడ్డి, మురళీకృష్ణ, యశోద, శాంతిప్రియ, యూడీసీ మదర్ సాహెబ్, జశ్వంత్, బుజ్జమ్మ, అరుణ తదితరులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం



ఖమ్మం/తల్లాడ నవంబర్ 11 (అక్షరం న్యూస్)
తల్లాడ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏ శ్రీధర్ రాజు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ మండల అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా మండలంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించడం జరిగింది. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని, అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఎంపిడిఓ అధికారులకు, సర్పంచులకు సూచించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను సర్పంచులు ఈ సమావేశంలో ఎంపిడిఓ దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ ప్రత్యూష, ఎంఈఓ దామోదర్ ప్రసాద్, మండల వ్యవసాయ శాఖ అధికారి ఎండి తాజుద్దీన్,వివిధ గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

ఖమ్మం టౌన్ ఏసీపీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్



ఖమ్మం/ నవంబర్ 11 (అక్షరం న్యూస్)

ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీస్ పరిపాలనను మరింత పటిష్టం చేయడం, విధుల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించడమే లక్ష్యంగా వార్షిక తనిఖీల్లో భాగంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఖమ్మం టౌన్ ఏసీపీ కార్యాలయాన్ని బుధవారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కార్యాలయంలోని వివిధ రికార్డులు, కేసుల వివరాలు, నిర్వహణకు సంబంధించిన రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతి, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు,

పోలీస్ స్టేషన్ల పనితీరుపై సమీక్షించారు.

ఈ సందర్భంగా పోలీస్ అధికారులకు పలు సూచనలు చేస్తూ, కేవలం కార్యాలయ స్థాయిలోనే కాకుండా క్షేత్రస్థాయిలోనూ పోలీస్ స్టేషన్ వారీగా సమగ్ర సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతిభద్రతల పరిస్థితి, నేరాల తీరు, పెండింగ్ కేసులు, ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదుల పరిష్కారంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు.ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంతో పాటు నేర నియంత్రణ, కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసుల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పోలీస్ కమిషనర్ ఆదేశించారు.అనంతరం ఏసీపీ కార్యాలయ ఆవరణలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని చాటిచెప్పారు.కార్యక్రమంలో ఏసీపీ రమణమూర్తి, ఇన్స్పెక్టర్లు సాధిక్ పాషా, రామకృష్ణ, చిట్టిబాబు, కరుణాకర్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ కృషి

- ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
- జాతీయ విద్యా దినోత్సవ వేడుకల్లో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు

పెద్దపల్లి టౌన్ నవంబర్ 11 అక్షరం న్యూస్

భారతదేశ విద్యా రంగానికి బలమైన పునాది వేసి, విద్యాభివృద్ధికి విశేష కృషి చేసిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు అన్నారు. దేశంలో విద్యా వ్యవస్థ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. బుధవారం పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన మైనారిటీల సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవ వేడుకల్లో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. 1888 నవంబర్ 11న సౌదీ అరేబియాలోని మక్కాలో జన్మించిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ అసలు పేరు మొహియుద్దీన్ అహ్మద్ అని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, గొప్ప విద్యావేత్తగా, పండితుడిగా, కవిగా ఆయన దేశానికి విశేష సేవలందించారని కొనియాడారు. అరబిక్, ఇంగ్లీష్, ఉర్దూ, హిందీ, పెర్షియన్, బెంగాలీ తదితర భాషల్లో ప్రావీణ్యం సంపాదించిన బహుభాషా కోవిదుడని వివరించారు. స్వాతంత్ర్యం అనంతరం భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా సుమారు 11 సంవత్సరాల పాటు బాధ్యతలు నిర్వహించి విద్యా రంగ అభివృద్ధికి అనేక సంస్కరణలు తీసుకొచ్చారని తెలిపారు. ఐఐటీలు, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ), సాహిత్య అకాడమీ, సంగీత నాటక అకాడమీ, లలిత కళా అకాడమీ వంటి ప్రముఖ విద్యా, సాంస్కృతిక సంస్థల అభివృద్ధికి ఆయన మార్గదర్శకత్వం వహించారని పేర్కొన్నారు. 14 సంవత్సరాల లోపు పిల్లలందరికీ ఉచిత, నిర్బంధ ప్రాథమిక విద్య అందించాలని ఆజాద్ ఆకాంక్షించారని, ముఖ్యంగా మహిళా అక్షరాస్యత, సాంకేతిక విద్య అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు. విద్య ద్వారానే సమాజంలో సమానత్వం, అభివృద్ధి సాధ్యమవుతాయని ఆయన విశ్వసించారని తెలిపారు. ఆయన విద్యా రంగానికి చేసిన సేవలను గుర్తిస్తూ భారత ప్రభుత్వం 2008 నుంచి నవంబర్ 11న జాతీయ విద్యా దినోత్సవంగా నిర్వహిస్తోందని చెప్పారు. ప్రతి సంవత్సరం పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యాసంస్థల్లో జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా సెమినార్లు, వ్యాసరచన పోటీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఆజాద్ ఆశయాలను విద్యార్థులకు తెలియజేయాలని సూచించారు. మైనారిటీల సంక్షేమం, విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి జి. రవికుమార్, కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైరా మండలంలో ప్రారంభమైన వరి కోతలు

ఖమ్మం/ వైరా నవంబర్ 11 (అక్షరం న్యూస్)

తల్లాడ మండలంలోని పుణ్యపురం, ఉప్పలమడక, నారపనేనిపల్లి, సిరిపురం గ్రామాల్లో వరి కోతలు ప్రారంభమయ్యాయి. పంటలు చేతికందే దశకు చేరుకోవడంతో రైతులు కోత పనుల్లో నిమగ్నమయ్యారు. కూలీలతో పాటు హార్వెస్టర్ల సాయంతో వరి కోతలు చేపడుతున్నారు. ఈ ఏడాది పంట దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కోతలు ప్రారంభం కావడంతో గ్రామాల్లో వ్యవసాయ పనులు సందడిగా మారాయి. అయితే ఇటీవల కురిసిన వర్షాల నేపథ్యంలో ధాన్యం నాణ్యత, దిగుబడిపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లకు



విదేశీ పౌరులకు వసతి కల్పించే సమయంలో యజమానులు సంబంధిత చట్ట నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి

పోలీస్ కమిషనర్ సునీల్ దత్



ఖమ్మం /స్టాఫ్ రిపోర్టర్ నవంబర్ 11 (అక్షరం న్యూస్)

భారత ప్రభుత్వ హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలోని బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం, ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ చట్టం--2025లోని సెక్షన్ 8 ప్రకారం ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో విదేశీ పౌరులకు వసతి కల్పించే హోటళ్లు, లాడ్జీలు, గెస్ట్‌హౌస్‌లు, హోమ్‌స్టేలు, ూఅతీఎఅ వసతులు, పేయింగ్ గెస్ట్ (గ్రూ+) కేంద్రాలు, హాస్టళ్లు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, మతపరమైన వసతి కేంద్రాలతో పాటు విదేశీ పౌరులకు తమ ఇళ్లలో బస కల్పించే వ్యక్తులు, సంస్థలు కూడా ఈ నిబంధనల పరిధిలోకి వస్తాయన్నారు. విదేశీ పౌరులకు వసతి కల్పించే వ్యక్తులు,సంస్థలు యజమాన్యం తప్పనిసరిగా వసతి పొందుతున్న వారి వివరాలను నిర్దిష్ట గడువులో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహించినా, నిబంధనలు ఉల్లంఘించినా యాజమాన్యం, సంస్థలపై చట్టప్రకారం చర్యలు తప్పవని అన్నారు. విదేశీ పౌరుల వివరాల నమోదు చట్టబద్ధమైన బాధ్యతని, ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించి పోలీసు, ఇమ్మిగ్రేషన్ అధికారులకు సహకరించాలన్నారు.విదేశీ పౌరులు (ూజ× కార్డుదారులు, నేపాల్, భూటాన్ పౌరులతో సహా) తమ వద్ద బస చేసినప్పుడు వారి రాక, బయలుదేరిన వివరాలను వారు వచ్చిన 24 గంటల్లోగా ఫారం-××× (గతంలో ఫారం-జ) ద్వారా సంబంధిత రిజిస్ట్రేషన్ అధికారికి ఆన్‌లైన్‌లో సమర్పించాలి. ఇందుకోసం సంబంధిత అధికారిక పోర్టల్‌లో ముందుగా నమోదు చేసుకుని లాగిన్ వివరాలు పొందాలి. విదేశీ అతిథులకు సంబంధించిన రికార్డులను కనీసం ఒక సంవత్సరం పాటు భద్రపరచాలన్నారు.

ఆన్‌లైన్ నమోదు కోసం అధికారిక వెబ్‌సైట్లులి

1. హోటళ్లు, లాడ్జీలు, గెస్ట్‌హౌస్‌లు, PG\T, Airbnb edŸÔåT\T:

https://indianfrro.gov.in/frro/FormC/login.jsp

2. వ్యక్తిగత ఇళ్లు, హోమ్‌స్టేలు, బంధువుల ఇళ్లు:

https://indianfrro.gov.in/frro/FormC/accm_regin.jsp?14gRPE3A02C

3. ఆసుపత్రులు, వైద్య చికిత్స కోసం వచ్చే విదేశీ పౌరులు:

https://indianfrro.gov.in/frro/medicalvisitretravel/

4. విద్యాసంస్థలు:
https://indianfrro.gov.in/fsis

నిర్దేశిత నిబంధనలను ఉల్లంఘించిన వారికి ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ చట్టం--2025లోని సెక్షన్ 23 ప్రకారం జరిమానాలు, చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది.

- ఫారం-××× సమర్పించని వాణిజ్య, వ్యక్తిగత వసతి కల్పించేవారికి ఒక్కో కేసుకు రూ.50,000 నుంచి జరిమానా, క్రిమినల్ ప్రాసిక్యూషన్ ఉండవచ్చు.
- ఆసుపత్రులు, విద్యాసంస్థలు వివరాలు సమర్పించకపోతే ఒక్కో కేసుకు రూ.1,00,000 నుంచి జరిమానా విధించవచ్చు.
- చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్టు, వీసా లేకుండా విదేశీ పౌరులకు ప్రవేశం కల్పించడం తీవ్రమైన నేరం. దీనికి గరిష్ఠంగా ఐదేళ్ల జైలు శిక్ష లేదా రూ.5 లక్షల వరకు జరిమానా లేదా రెండూ విధించవచ్చు.
- నకిలీ లేదా మోసపూరిత ప్రయాణ పత్రాల వినియోగానికి రెండు నుంచి ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.1 లక్ష నుంచి రూ.10 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది.
- వీసా గడువు ముగిసిన తర్వాత కూడా దేశంలో కొనసాగితే గరిష్ఠంగా మూడేళ్ల జైలు శిక్ష లేదా రూ.3 లక్షల వరకు జరిమానా లేదా రెండూ విధించవచ్చు.
- చట్టం కింద నేరాలకు ప్రేరేపించినా, సహకరించినా సంబంధిత వ్యక్తులు కూడా శిక్షార్హులవుతారు.

విదేశీ పౌరులు పాటించాల్సిన సూచనలు

విదేశీ పౌరులు చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్టు, వీసాతోనే భారతదేశంలో నివసించాలి. తమ వసతి కల్పించేవారి ద్వారా ఫారం-××× వివరాలు ఆన్‌లైన్‌లో సమర్పించబడినట్లు నిర్ధారించుకోవాలి. నివాస చిరునామా మార్పులు, పాస్‌పోర్టు లేదా వీసా పోగొట్టుకున్న సందర్భాలను సంబంధిత అధికారులకు వెంటనే తెలియజేయాలి. వీసా గడువు ముగిసిన తర్వాత దేశంలో ఉండకూడదు. తప్పుడు పత్రాలు సమర్పించడం, అనుమతి లేని ఉద్యోగాలు లేదా నిషేధిత కార్యకలాపాలకు పాల్పడటం చేయకూడదు.

గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో నిపుణులైన వైద్యులను నియమించాలి

- కార్డియాలజిస్ట్, న్యూరో సర్జన్‌ను వెంటనే నియమించాలి.. ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ఈదునూరి నర్సింగ్



జ్యోతినగర్, ఎన్టీపీసీ నవంబర్ 11 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ :

గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్ వంటి ప్రాణాపాయ వ్యాధులతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారని, ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని టీఆర్ఎస్ డి పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈదునూరి నర్సింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కార్డియాలజిస్ట్, న్యూరో సర్జన్‌లను తక్షణమే నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వేలాది మంది పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రధాన వైద్య కేంద్రంగా ఉందన్నారు. స్థానిక ప్రజలతో పాటు సింగరేణి కార్మిక కుటుంబాలు, రోజువారీ కూలీలు, వృద్ధులు, ఆర్థికంగా వెనుకబడిన వారు ఈ ఆసుపత్రిపైనే ఆధారపడుతున్నారని తెలిపారు. అయితే గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్, పక్షవాతం వంటి అత్యవసర సమస్యలకు చికిత్స అందించాల్సిన నిపుణులైన వైద్యులు అందుబాటులో లేకపోవడం ఆందోళనకరమన్నారు.ముఖ్యంగా అర్ధరాత్రి వేళ గుండెపోటు లేదా బ్రెయిన్ స్ట్రోక్ వస్తే స్థానికంగా తగిన వైద్యం అందక, ప్రైవేట్ ఆసుపత్రుల్లోనూ అత్యవసర చికిత్స లభించని పరిస్థితులు ఎదురైతే బాధితులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని పేర్కొన్నారు. ప్రాణాపాయ పరిస్థితుల్లో ప్రతి నిమిషం విలువైనదని, సకాలంలో వైద్యం అందకపోతే బాధితుల ప్రాణాలకే ముప్పు ఏర్పడుతుందని అన్నారు.

ఆర్థిక స్థోమత లేని పేదలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లలేక, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ పూర్తిస్థాయి వైద్యం పొందలేని పరిస్థితి మారాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ఆధునిక వైద్య పరికరాలు, నిపుణులైన వైద్యులు, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు.

రాష్ట్ర ప్రభుత్వం, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, సంబంధిత ఉన్నతాధికారులు ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వెంటనే కార్డియాలజిస్ట్, న్యూరో సర్జన్‌లను నియమించాలని డిమాండ్ చేశారు. గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్ బాధితులకు 24 గంటల అత్యవసర వైద్య సేవలు అందించాలని, అవసరమైన వైద్య పరికరాలు, మందులు సమకూర్చాలని కోరారు. వైద్యుల కొరతను అధిగమించి పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య భరోసా కల్పించాలని ఈదునూరి నర్సింగ్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు అచ్యుతాపురం విద్యార్థి ఎంపిక

- జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయికి చైతన్య భార్గవ్
- విద్యార్థిని అభినందించిన పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు



భద్రాద్రి కొత్తగూడెం / అశ్వారావుపేట / నవంబర్ 11 / అక్షరం న్యూస్ :అశ్వారావుపేట మండలంలోని అచ్యుతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ముద్దిన చైతన్య భార్గవ్ అండర్-14 రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. దీంతో పాఠశాలతో పాటు గ్రామంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

ప్రతిభతో రాష్ట్ర స్థాయికి

జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో చైతన్య భార్గవ్ తన ఆటతీరుతో ప్రతిభను చాటుకుని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

అభినందనల వెల్లువ

విద్యార్థి విజయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షేక్ షాహీనా బేగం, పీఈటీ నాగేంద్రబాబు, గ్రామ సర్పంచ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్, ఉపాధ్యాయ బృందం, గ్రామస్థులు ప్రత్యేకంగా అభినందించారు.

మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్ష

రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ చైతన్య భార్గవ్ ఇదే ప్రతిభను కనబరిచి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఆకాంక్షించారు.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers, RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609